PRGI - TGTEL/25/A0348

జాతీయ తెలుగు దినపత్రిక

Published by
తెలంగాణ - ఆంధ్ర ప్రదేశ్

# సందేశం టైమ్స్

నిజం దాగదు - వార్త ఆగదు

శుక్రవారం 25-09-2026 | పేజీలు : 8 | వెల రు : 2/- | సంపుటి : 2 సంచిక :115 | ప్రచురణ: సూర్యాపేట | ఎడిటర్ : శెట్టి వెంకటేష్

## సీఈసీ రాజీనామా చేయకుంటే 'జంతర్ మంతర్ 2.0'! - సీజేపీ



2లో▸

## జ్ఞానేశ్ కుమార్‌పై అభిశంసనకు విపక్షాలు సిద్ధం!




2లో▸

## శబరిమలలో బంగారు కిరీటం మాయమైందా..? వార్తల్లో నిజమెంత..!




2లో▸

### కాకినాడ జిల్లాలో భారీవర్షాలపై

## పవన్ సమీక్ష



కాకినాడ జిల్లాలో భారీవర్షాలపై కలెక్టర్‌తో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సమీక్ష నిర్వహించారు.

2లో▸




హైదరాబాద్: రాష్ట్రంలో పలుచోట్ల ఈ నెల 24, 25, 26 తేదీల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణశాఖ ఎరుపు రంగు హెచ్చరికలు జారీ చేసింది.

2లో▸

### దసరాలోపు యాదాద్రి థర్మల్ విద్యుత్

# కేంద్రం పూర్తి చేయాలి

## -సీఎం రేవంత్ రెడ్డి




2లో▸

దసరాలోపు యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం పూర్తి స్థాయిలో ఉత్పత్తి చేయాలని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.
గురువారం విద్యుత్ శాఖపై ఎంసీఆర్ హెచ్‌ఆర్డీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమీక్షించారు.
యాదాద్రి థర్మల్ కేంద్రంలో పూర్తి స్థాయి విద్యుత్ ఉత్పత్తి చేయకపోవడంపై అధికారులను సీఎం, డిప్యూటీ సీఎంలు ప్రశ్నించారు.
యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలో ఉత్పత్తికి జీ 9 బొగ్గు అవసరమని అధికారులు
తెలిపారు. సింగరేణి లో జీ 9 బొగ్గు ఉత్పత్తి చేసే బ్లాకులు లేవని, సమీప భవిష్యత్తులోనూ సింగరేణి నుంచి జీ 9 బొగ్గు ఉత్పత్తి అయ్యే అవకాశం లేదని అధికారులు చెప్పుకొచ్చారు.
జీ 9 బొగ్గు లభ్యత లేనప్పుడు ఆ సాంకేతికతతో ఎలా యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం నిర్మించారని సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క లు ప్రశ్నించారు. పిట్ హెడ్ (బొగ్గు గనుల పైనే విద్యుత్ కేంద్ర నిర్మాణం) కాకుండా, దూరంగా ఎందుకు యాదాద్రి థర్మల్ కేంద్రం నిర్మించారని, దానికి బొగ్గు సరఫరాతో రాష్ట్రంపై పడే అదనపు భారం ఎంత అని సీఎం, డిప్యూటీ సీఎం లు అధికారులని ప్రశ్నించారు. నాడు రాజకీయ కారణాలతోనే పిట్ హెడ్ పై కాకుండా దూరంగా యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం నిర్మించారని అధికారులు తెలిపారు. యాదాద్రికి బొగ్గు సరఫరాతో తెలంగాణ రాష్ట్రంపై రూ. 40 వేల కోట్ల అదనపు భారం పడుతోందని అధికారులు వివరించారు.

## ఖైరతాబాద్ దానం నాగేందర్ అడ్డా..

### ప్రజల్లో నాకు బలముంది: దానం



2లో▸

### దానం నాగేందర్‌పై సుప్రీం తీర్పు

## రాజ్యాంగ విజయం:

### ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



2లో▸

హైదరాబాద్: దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సమర్థించడం రాజ్యాంగ విజయమని భాజపా శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు.

# ఒక వికెట్ పడింది, త్వరలో మరికొన్ని వికెట్లు ..

## దానం అనర్హతపై కేటీఆర్ ట్వీట్




హైదరాబాద్ : ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హతపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన ట్వీట్ చేశారు. ఒక వికెట్ పడింది. త్వరలో మరికొన్ని వికెట్లు పడుతాయని జోస్యం చెప్పారు.

2లో▸

PRGI - TGTEL/25/A0348
జాతీయ తెలుగు దినపత్రిక
Published by తెలంగాణ - ఆంధ్ర ప్రదేశ్
సందేశం టైమ్స్
నిజం దాగదు - వార్త ఆగదు
25-09-2026

# సంపాదకీయం

## కొత్త రాజ్యాంగం ఎలా ఉండాలి?

మానవ నాగరికతల గమనం అనూహ్య వేగంతో, ఆశ్చర్యకరమైన, అదే సమయంలో భయ విహ్వలమైన మార్పులతో సాగుతోంది. ఈ చారిత్రక దశ (21వ శతాబ్ది)లో ప్రజాస్వామ్య వ్యవస్థలకు మార్గదర్శకత్వం వహించే ఒక సరికొత్త రాజ్యాంగం ఎలా ఉండాలి? ప్రపంచ అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థగా ఉన్న భారతదేశ పౌరులమైన మనకు ఆ ప్రశ్న ఒక విధమైన ఆందోళన, భయాన్ని కలిగిస్తుంది. ఎందుకంటే, భారత రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని దెబ్బతీసే ప్రమాదం పొంచి ఉన్నందున. ట్రంప్ అమెరికాలో ప్రజాస్వామ్యం ఎదుర్కొంటున్న సంక్షోభం, యూరప్‌లో కరుడుగట్టిన మితవాదశక్తులకు క్రమేణా పెరుగుతున్న రాజకీయ ప్రాబల్యాన్ని గమనిస్తే ప్రజాస్వామ్యానికి దాపురిల్లుతోన్న దయనీయ స్థితి అవగతమవుతుంది. ఈ పరిణామాల దృష్ట్యా '21వ శతాబ్దానికి కొత్త రాజ్యాంగం ఎలా ఉండాలి? అన్న ప్రశ్న ప్రపంచవ్యాప్తంగా ఎంత అత్యవసరమైనదో మనం అర్థం చేసుకోవచ్చు. రాజ్యాంగాన్ని ఒక నామవాచకంగా మాత్రమే కాకుండా ఒక క్రియగా చూడాలి. ఒక ప్రజాస్వామిక వ్యవస్థను స్థాపించడం, నిర్మించడం అనే కోణంలో ఆలోచించాల్సిన అవసరమున్నది. అలా ఆలోచిస్తే కొత్త రాజ్యాంగం అనే భావన ప్రజాస్వామ్య భవిష్యత్తును వినూత్నంగా ఊహించేందుకు అవకాశం కల్పిస్తుంది.

సదరు ప్రపంచ ప్రశ్నకు సమాధానమివ్వగల విశిష్టత భారత ప్రజాస్వామ్యానికి ఉందని నిశ్చితంగా చెప్పవచ్చు. నిజమే, మన ప్రజాస్వామ్యం ఇప్పుడు సవ్యంగా లేదు. నిక్కచ్చిగా చెప్పాలంటే ప్రజాస్వామ్య పతనానికి ఒక ఉదాహరణగా ఉంది. అయితే ప్రజాస్వామ్య పునరుజ్జీవానికి, ప్రభావదాయక వికాసానికి దోహదం చేసే కొత్త ఆలోచనలను అది అందించగలదని కూడా మనం నమ్మకంగా చెప్పగలం. పురానవ భారతీయ భావన స్వరాజ్‌నే తీసుకోండి. ప్రజాస్వామ్య ఆదర్శాన్ని సమున్నతపరిచే భావన అది, సందేహం లేదు. ప్రజాస్వామ్యం అంటే ఏమిటి అన్న ప్రశ్నను సాధారణంగా వివేచించినప్పుడు ప్రజల స్వయం పాలన, పాలకులతో ప్రజలకు ఉండే సంబంధాల తీరుతెన్నులు ప్రధానంగా ఆలోచనకు వస్తాయి. తమ పాలకులను ఎన్నుకునేందుకు, ఎన్నుకున్న తరువాత వారు బాధ్యతాయుతంగా వ్యవహరించేలా జాగ్రత్త వహించేందుకు పౌరులకు సమాన హక్కు ఉండాలన్నది ప్రజాస్వామ్య భావన. అయితే పౌరుల మధ్య సంబంధాలు ఎలా ఉండాలనే విషయమై మనం పెద్దగా శ్రద్ధ చూపం. ఇదిగో ఇక్కడే స్వరాజ్ భావనకు గాంధీజీ ఒక భిన్నమైన, మౌలిక అర్థాన్ని సమకూర్చారు. స్వరాజ్ అంటే కేవలం స్వయం పాలన మాత్రమే కాదని, అది మనల్ని మనం నియంత్రించుకోవడమని ఆయన స్పష్టం చేశారు. ప్రతి పౌరుడూ తన తోటి పౌరులతో నైతిక విలువల స్ఫూర్తితో సంబంధాలు నెరపడమే స్వరాజ్ అని గాంధీజీ అన్నారు. ఇటువంటి స్వరాజ్యమే ప్రజాస్వామ్య సమస్యలకు పరిష్కారాలను సమకూర్చగలదు. ఈ వినూత్న స్వరాజ్ భావన ప్రకారం ఒక ప్రజాస్వామిక సమాజం ఉమ్మడి ప్రమాణాలకు కట్టుబడి ఉండాలి. నిష్పాక్షిక చర్చలు, స్వయం నియంత్రణ అనేవి అటువంటి ప్రజాస్వామ్యానికి ప్రాథమిక ప్రాతిపదికలుగా ఉంటాయి. సౌభ్రాతృత్వం అనేది ప్రజాస్వామ్య పరిపుష్టికి ఒక ప్రాథమిక నిబంధన అని డాక్టర్ అంబేద్కర్ సైతం నొక్కి చెప్పడం గమనార్హం. సమాజంలో సహోదరభావం లేనప్పుడు ప్రజాస్వామ్యం ఆచరణలో విజయవంతమవదని ఆయన స్పష్టం చేశారు.

ప్రజాస్వామ్యం అంటే కేవలం మంచి వ్యవస్థలు ఉండడం మాత్రమే కాదు, ప్రజాస్వామిక పద్ధతుల బలమైన ఆచరణ కూడా. ప్రజలలో ప్రజాస్వామిక ఆకాంక్షలు సహజంగా ఉంటాయి. అయితే సమాజ సమష్టి జీవనంలో ప్రజాస్వామిక పద్ధతులను నియమబద్ధంగా పెంపొందించాల్సి ఉంటుంది. ఒక ప్రజాస్వామిక వ్యవస్థను నిర్మించడమంటే ప్రజాస్వామిక పద్ధతులను పరిపుష్టం చేయడమే. పంటల సాగు కార్యకలాపాలు ప్రజాస్వామిక పద్ధతులు, సుగుణాలను ఎలా పెంపొందిస్తాయో మానవ శాస్త్రవేత్త ముకూలికా బెనర్జీ తన పరిశోధనా గ్రంథం 'కల్టివేటింగ్ డెమొక్రసీ'లో వివరించారు. ప్రజాస్వామ్య సంస్కృతిని నిర్మించేందుకు, సుస్థిరం చేసేందుకు సమాజంలో పరస్పర సంబంధాలు సోదరభావంతో ఉండాలి. సమాజ సభ్యులందరికీ ఒక ఉమ్మడి లక్ష్యం ఉండాలి. నిత్య పరిణామశీల కాలంలో ప్రభవించే ప్రతి కొత్త తరానికీ ఆ ఉమ్మడి లక్ష్యాన్ని మళ్లీ మళ్లీ వివరించాలి. సద్వర్తనులు అయిన రాజకీయ నాయకులను రూపొందించుకోవాలి. ప్రజాస్వామ్య ప్రక్రియలలో స్వార్థ ప్రయోజనాలకు యథాలాపంగా పాల్గొనే వారికి కాకుండా ఒక సమున్నత ఆశయానికి నిబద్ధమై, దాన్ని సాధించేందుకు అంకితమయ్యే ఆదర్శవాదులకు అధిక ప్రాధాన్యమివ్వాలి.

21వ శతాబ్దిలో ప్రజాస్వామిక వ్యవస్థల రూపకల్పన విషయమై పునరాలోచనకు 20వ శతాబ్ది భారతీయ రాజకీయ ఆలోచనాపరుల భావ స్రవంతి విశేషంగా దోహదం చేయగలదు. వారందరూ పరిపూర్ణ ప్రగతిశీలురు, స్వాతంత్ర్యానంతరం భారతదేశంలో ప్రజాస్వామిక వ్యవస్థల తీరుతెన్నుల సార్థకతను సంశయించినవారే. 'ప్రజా స్వామ్య సాఫల్యతకు అంబేద్కర్ నొక్కి చెప్పిన ప్రాథమిక నిబంధనలు, మానవేంద్రనాథ్ రాయ్ ప్రతిపాదించిన పార్టీ రహిత ప్రజాస్వామ్యం, భారతదేశ రాజ్య పాలనా పద్ధతుల పునర్నిర్మాణం విషయమై జయప్రకాశ్ నారాయణ్ వాదనలు, అధికార వికేంద్రీకరణకు రామ్‌మనోహర్ లోహియా సూచించిన చౌకంభా రాజ్ (గ్రామం, జిల్లా, రాష్ట్రం, కేంద్రం అనే నాలుగు స్తంభాల రాజ్యం) మొదలైన విశిష్ట ఆలోచనలు ఏవీ వారి వారి జీవిత కాలంలో విస్తృత స్థాయిలో ఆమోదం పొందలేదు. ప్రస్తుత కాలంలోనూ ఆ భావాలను వాటి మౌలిక రూపంలో అనుసరించలేము. అయితే ఆధునిక ప్రజాస్వామ్యాలలో మనం ప్రశ్నించకుండా, సహజమైనవిగా భావించే కొన్ని ప్రాథమిక వ్యవస్థలను, విశ్వాసాలను సరికొత్తగా పునర్నిర్మించుకునేందుకు అవి తప్పక దోహదం చేస్తాయి.

ఆధునిక ప్రజాస్వామ్యాలలోని లోపాలు, లొసుగులు కొన్నిటిని నిశితంగా చూద్దాం. ఈ ప్రజాస్వామ్యాలు చాలా విస్తృతస్థాయిలో పనిచేస్తుండడంతో స్వయం పాలన అనేది అర్థవంతంగా అమలవడం అసాధ్యమవుతోంది. జాతి రాజ్యాలు, వాటిలోని పాలనా విభాగాలు సైతం అదుపు చేయలేనివిగా ఉంటున్నాయి. ప్రయోజనకరమైన స్వయం పాలనను అవి అనుమతించడం లేదు. ఒక సమస్య ఏ స్థాయిలో కనిపిస్తుందో, దానిని పరిష్కరించే శక్తి లేదా అధికారం అంతకంటే భిన్నమైన, సాధారణంగా చాలా పై స్థాయిలో ఉంటుంది. ఈ రెండిటి మధ్య పొంతన ఉండడం లేదు. ఫలితంగా ప్రజల సమస్యలు తీరకపోగా అవి మరింత సంక్లిష్టమవుతున్నాయి. ప్రజాస్వామిక పాలనా వ్యవస్థను క్రింది స్థాయి నుంచి వికేంద్రీకరించాలనే వాదన ఒకటి ఉన్నది. ఈ వికేంద్రీకరణ అనేది 'సబ్సిడియారిటీ సూత్రం' (ఒక సమస్యను పరిష్కరించడం లేదా ఒక నిర్ణయాన్ని తీసుకోవడం అనేది దానికి అత్యంత సమీపంలో ఉన్న, సమర్థంగా పరిష్కరించగల లేదా మెరుగ్గా తీసుకోగల కింది స్థాయి అంటే స్థానిక పాలనా వ్యవస్థలే పరిష్కరించడం లేదా తీసుకోవడం) ప్రకారం జరిగి తీరాలి. ప్రతి 5 లేదా 4, లేదా 2 ఏళ్లకు జరిగే ఎన్నికల కాల పరిమితి ఒకే సమయంలో ఇది చాలా తక్కువగానూ, చాలా ఎక్కువగానూ ఉంటుంది. మరింత స్పష్టంగా చెప్పాలంటే ప్రజాహిత పాలన చేస్తున్న ప్రభుత్వాలకు ఐదేళ్ల కాలం సరిపోదు. సమాజానికి జరగాల్సిన మేలు అసమగ్రంగా ఉండిపోతుంది. ఇక స్వార్థ ప్రయోజనాలకు ప్రజాకంటక పాలన చేసే ప్రభుత్వాలను అధికారం నుంచి తొలగించేందుకు ఐదేళ్ల వ్యవధి చాలా ఎక్కువ సమయం. ఆధునిక ప్రజాస్వామ్యాలలోని మరో ముఖ్యమైన లోపం ఎన్నికలలో సాధారణ మెజారిటీతో గెలిచిన రాజకీయ పక్షాలకు సర్వాధికారాలను అప్పగించడం. దీనివల్ల చాలా హాని జరుగుతుంది. నేడు పలు దేశాలలో మెజారిటేరియన్ పాలనాధోరణులు ప్రబలిపోవడానికి ప్రధాన కారణం ప్రజాస్వామ్య వ్యవస్థ దారి తప్పడం కానే కాదు. మనం ప్రజాస్వామ్యంగా పరిగణిస్తున్న వ్యవస్థ అంతర్గత రూపకల్పన నుంచే ఆ హానికర ధోరణులు ఉత్పన్నమవుతున్నాయి. ఏ పార్టీకి ఎక్కువ సీట్లు వస్తే దానికే పూర్తి అధికారాలు అప్పగించాలని మనం నిర్దేశించుకున్న ప్రజాస్వామ్య నియమమే నిరంకుశ పాలనకు దారితీస్తుందన్న సత్యాన్ని మనం గుర్తించాలి.

ప్రజాస్వామ్యానికి అవరోధమవుతున్న వ్యవస్థీకృత లోపాలు, లొసుగులను కూడా ఆధునిక భారత రాజకీయ ఆలోచనాశీలురు మన దృష్టికి తెచ్చారు. కులం, వర్గం మొదలైన సామాజిక అసమానతలు ప్రజాస్వామిక పద్ధతులను అపహాస్యం చేస్తున్నాయి. కుల వ్యవస్థ, పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ, సామాజిక, ఆర్థిక అధికారాల కేంద్రీకరణను ప్రోత్సహిస్తున్నాయి. సమాన హక్కులు ఉన్న పౌరుల స్వయం పాలన భావనకు ఆ అధికారాల కేంద్రీకరణ పూర్తిగా విరుద్ధమైనది. సమాచార, ప్రసార మాధ్యమాలు కార్పొరేట్ సంస్థల నియంత్రణలో ఉండడం వల్ల ప్రజాస్వామిక ప్రజాభిప్రాయం పెంపొందడానికి తీవ్ర అవరోధాలు ఏర్పడుతున్నాయి. కార్పొరేట్ నియంత్రిత, పాలకవర్గాల అనుకూల పత్రికలు, టీవీలు మొదలైనవి అసంపూర్ణ సమాచారాన్ని, లేదా

### కాకినాడ జిల్లాలో భారీవర్షాలపై

# పవన్ సమీక్ష

మొదటిపేజీ తరువాయి

కాకినాడ జిల్లాలో భారీవర్షాలపై కలెక్టర్‌తో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సమీక్ష నిర్వహించారు. వర్షాలు పూర్తిగా తగ్గుముఖం పట్టేవరకు అప్రమత్తంగా ఉండాలన్నారు. లోతట్టు ప్రాంతాలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. వరద ముప్పు ఉన్న ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతానికి తరలించాలన్నారు. రోడ్లపై కూలిన చెట్లు తొలగించి రాకపోకలు పునరుద్ధరించాలని సూచించారు. నీటి నిల్వలు లేకుండా డీవాటరింగ్ చేసేలా చూడాలన్నారు. తక్షణం పంటనష్టం అంచనాలు రూపొందించి నివేదిక ఇవ్వాలన్నారు. ఆస్తి నష్టం జరిగిన చోట పరిహారం అందించాలని చెప్పారు. పిఠాపురం నియోజకవర్గంలో సుద్దగడ్డ వాగు ముంపుపై పవన్ ఆరా తీశారు. ఉప్పాడ తీరంలో పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

# ఖైరతాబాద్ దానం నాగేందర్ అడ్డా..

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: ఎమ్మెల్యే పదవికి అనర్హత అంశంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నట్లు దానం నాగేందర్ తెలిపారు. ప్రజాక్షేత్రంలో తనకు బలముందని చెప్పారు. అనర్హత వేటుపై హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ దానం సుప్రీంకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. ఆయన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం గురువారం డిస్మిస్ చేసింది. ఈ నేపథ్యంలో దానం నాగేందర్ మీడియాతో మాట్లాడారు.

"ఎంపీగా పోటీ చేసినప్పుడే ఊహించా.. అదే జరిగింది. లీగల్‌గా పోరాడటంలో తప్పులేదు. పదో షెడ్యూల్ ప్రకారం రిలీఫ్ దొరుకుతుందని అనుకున్నా. మళ్లీ ఎన్నికల్లో పోటీ చేసుకోవచ్చని సుప్రీంకోర్టు చెప్పింది. నేను ప్రతి ఇంటికి వెళ్లి సేవ చేశా.. నేనేంటో ప్రజలను అడిగితే తెలుస్తుంది. ఉప ఎన్నికలో పోటీపై సీఎం స్పష్టత ఇస్తారు. గతంలో మూడుసార్లు గెలిచాను. ఒక ఉప ఎన్నికలో 1,600 ఓట్లతో ఓడిపోయాను. ఇప్పుడు పరిస్థితులు చాలా అనుకూలంగా ఉన్నాయి. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితాలే ఇక్కడా రిపీట్ అవుతాయి. ఖైరతాబాద్ దానం నాగేందర్ అడ్డా. కలిసి పనిచేస్తాం.. తప్పకుండా గెలుస్తాం" అని దానం నాగేందర్ అన్నారు.

# ఒక వికెట్ పడింది, త్వరలో మరికొన్ని వికెట్లు ..

మొదటిపేజీ తరువాయి

దానం నాగేందర్ బీఆర్ఎస్ టికెట్‌పై పోటీ చేసి గెలుపొందిన తరువాత కాంగ్రెస్‌లో చేరడంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి, బీజేపీ ఎమ్మెల్యే హైకోర్టులో కేసు దాఖలు చేశారు. పార్టీ ఫిరాయింపుల చట్టం ప్రకారం దానంపై అనర్హత వేయాలని కోర్టును కోరారు.

దాదాపు రెండు సంవత్సరాల వరకు ఇరువాదనలు విన్న హైకోర్టు రెండు రోజుల క్రితం దానం నాగేందర్‌పై అనర్హత వేసింది. అనర్హత చెల్లదని సుప్రీంకోర్టులో దానం నాగేందర్ పిటిషన్ వేయగా గురువారం పిటిషన్‌ను పరిశీలించింది. ఈ విషయంలో హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించడంతో ఖైరతాబాద్ నియోజకవర్గానికి ఉప ఎన్నిక జరగనుంది.

### దసరాలోపు యాదాద్రి థర్మల్ విద్యుత్

# కేంద్రం పూర్తి చేయాలి

మొదటిపేజీ తరువాయి

సింగరేణి నుంచి జీ 9 బొగ్గు కు ఉన్న అవకాశాలపై సీఎం, డిప్యూటీ సీఎం లు ఆరా తీశారు. గత ప్రభుత్వం బొగ్గు బ్లాకుల వేలంలో పాల్గొనకపోవడంతో జీ 9 బొగ్గును సింగరేణి సరఫరా చేయలేదని అధికారులు

తేల్చి చెప్పారు. సింగరేణిలో ఇప్పటికే 14 బొగ్గు బ్లాకులు మూతపడ్డాయని అధికారులు వివరించారు. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న విద్యుత్ అవసరాల దృష్ట్యా మహానది కోల్ ఫీల్డ్స్, కోల్ ఇండియా నుంచి బొగ్గు కొనుగోలుకు చర్యలు ప్రారంభించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క లు ఆదేశాలు జారీ చేశారు. తక్షణమే కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డితో చర్చించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు.

## ప్రణయ్ పరువు హత్యకేసు.. చర్లపల్లి జైల్లో శిక్ష అనుభవిస్తున్న ఖైదీ మృతి



చర్లపల్లి (హైదరాబాద్): ప్రేమ వివాహం చేసుకున్న నల్గొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన ప్రణయ్ హత్య కేసు(ౄతీఖుఋఎ ఎబతీసవతీ ఝుంవ)లో జీవితఖైదు అనుభవిస్తున్న అబ్దుల్ బారీ (50) చర్లపల్లి జైలులో గుండెపోటుతో మృతి చెందాడు. గురువారం మధ్యాహ్నం 3గంటల సమయంలో గుండెపోటు రావడంతో జైలు సిబ్బంది వెంటనే సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అబ్దుల్ బారీ మృతి చెందాడు. 2018 సెప్టెంబర్ 14న నల్గొండ జిల్లా మిర్యాలగూడలో సంచలనం సృష్టించిన పెరుమాళ్ల ప్రణయ్ పరువు హత్య కేసులో బారీ నాల్గో నిందితుడు. గుజరాత్‌కు చెందిన మాజీ హోంమంత్రి హరేన్ పాండ్యా హత్య కేసులోనూ అబ్దుల్ బారీ నిందితుడిగా ఉన్నాడు.

తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన, నల్గొండ జిల్లా మిర్యాలగూడలో 2018లో జరిగిన పెరుమాళ్ల ప్రణయ్‌కుమార్ పరువు హత్య కేసులో ఒకరికి ఉరిశిక్ష, మరో ఆరుగురికి జీవితఖైదు విధిస్తూ నల్గొండ ఎస్సీ, ఎస్టీ కేసుల విచారణ ప్రత్యేక న్యాయస్థానం, రెండో అదనపు సెషన్స్ జిల్లా కోర్టు గతేడాది మార్చిలో సంచలన తీర్పు ఇచ్చింది. ఈ కేసులో ప్రథమ ముద్దాయి తిరునగరు మారుతీరావు... 2020లో హైదరాబాద్‌లో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో అతనిపై విచారణను న్యాయస్థానం అప్పుడే నిలిపివేసింది. ఐదేళ్ల తొమ్మిదినెలల సుదీర్ఘ విచారణ తర్వాత.. హత్యలో కీలక పాత్రధారి సుభాష్‌కుమార్‌శర్మకు ఉరిశిక్ష, ఏ3: అస్గర్ అలీ, ఏ4: అబ్దుల్ బారీ, ఏ5: అబ్దుల్ కరీం, ఏ6: శ్రవణ్‌కుమార్ (మారుతీరావు తమ్ముడు), ఏ7: శివ (మారుతీరావు కారుడ్రైవర్), ఏ8: నిజాం (ఆటోడ్రైవర్)కు జీవిత ఖైదు విధిస్తూ న్యాయస్థానం అప్పట్లో తీర్పు ఇచ్చింది.

# సీఈసీ రాజీనామా చేయకుంటే 'జంతర్ మంతర్ 2.0'! - సీజేపీ

మొదటిపేజీ తరువాయి

ఎన్నికల సంఘం ప్రత్యేక సమగ్ర సవరణ అంశంపై కాక్రోచ్ జనతా పార్టీ తీవ్ర స్థాయిలో స్పందించింది. ప్రధాన ఎన్నికల కమిషనరు (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ 48 గంటల్లో రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. లేదంటే జంతర్ మంతర్ వద్ద మరోసారి నిరసన కార్యక్రమాన్ని చేపడతామని హెచ్చరించింది. సర్‌పై జాతీయ మీడియాలో వచ్చిన కథనాలతో దుమారం చెలరేగిన నేపథ్యంలో దిల్లీలో మీడియా సమావేశం ఏర్పాటు చేసిన సీజేపీ ప్రతినిధులు.. త్వరలో జరగబోయే అన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలనూ నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

"రెండు రోజుల్లోగా సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయకుంటే దేశ వ్యాప్తంగా నిరసనలు చేపడతాం. అనంతరం దిల్లీలో జంతర్ మంతర్ 2.0 తప్పకుండా చేపట్టి తీరుతాం. ఎన్నికల్లో అవకతవకలు జరిగాయని భావిస్తే విపక్షాలు ఎన్నికల ప్రక్రియలో పాల్గొనవద్దు. ప్రజాస్వామ్యానికి సీఈసీ ఓ ముప్పులా తయారయ్యారు. ఓటు హక్కు రద్దు చేసేందుకు ఆయన ఎవరు?" అని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ప్రశ్నించారు.

'సర్'పై ఈసీల ఢీ.. మీడియాలో కథనాలతో దుమారం

సీజేపీ కో-కన్వీనర్ సౌరవ్ దాస్ మాట్లాడుతూ.. మూడు డిమాండ్లను ఈసీ ముందు ఉంచుతున్నామని చెప్పారు. సీఈసీ రాజీనామా చేయడంతోపాటు ఆయనపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలన్నారు. సర్‌ను నిలిపివేసి 2025 ఓటర్ల జాబితానే పరిగణనలోకి తీసుకోవాలని, సర్‌కు సంబంధించిన ఫైళ్లన్నింటినీ సుప్రీం కోర్టు నియమించిన కమిటీ ఆధీనంలో ఉంచాలని కోరారు.

# జ్ఞానేశ్ కుమార్‌పై అభిశంసనకు విపక్షాలు సిద్ధం!

మొదటిపేజీ తరువాయి

ఎన్నికల సంఘంలో విభేదాలున్నట్లు ఇటీవల జాతీయ మీడియాలో కథనాలు రావడంతో విపక్షాలు అప్రమత్తమయ్యాయి. ఈ క్రమంలో ప్రధాన ఎన్నికల కమిషనరు జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని కోరుతూ పార్లమెంటు ఉభయ సభల్లో తీర్మానాన్ని ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. ఇందుకు సంబంధించి తీర్మానం ముసాయిదాను రూపొందించే పనిలో నిమగ్నమయ్యాయని, న్యాయ నిపుణుల పరిశీలన అనంతరం వారం రోజుల్లో ఈ నోటీసులు ఇవ్వనున్నట్లు సంబంధిత వర్గాల సమాచారం. సీఈసీపై నోటీసులకు సంబంధించి జాతీయ స్థాయిలో విపక్షాలు కలిసి పనిచేస్తున్నాయని తెలుస్తోంది. అయితే, సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించేందుకు ప్రయత్నాలు చేస్తున్న విపక్షాలు.. పార్లమెంటులో తీర్మానం ప్రవేశపెట్టడం మూడోసారి కావడం గమనార్హం. గతంలో ఓసారి ఉభయ సభల్లో నోటీసులు ఇచ్చినప్పటికీ అవి తిరస్కరణకు గురయ్యాయి. ఆ తర్వాత సీఈసీని తొలగించాలని కోరుతూ ఏప్రిల్ 24న 73 మంది విపక్ష ఎంపీలు తీర్మానాన్ని ప్రవేశపెట్టగా.. ప్రస్తుతం అది రాజ్యసభలో పెండింగులో ఉంది. తాజాగా ఎన్నికల కమిషన్‌లో భిన్నాభిప్రాయాల అంశం తెరమీదకు రావడంతో ప్రధాన కమిషనరు తొలగింపునకు విపక్షాలు మరోసారి ప్రయత్నాలు మొదలుపెట్టాయి.

# మూడో బిడ్డకు జన్మనిస్తే.. రూ.50 వేల ఎఫ్‌డీ!

మొదటిపేజీ తరువాయి

తమ సామాజిక వర్గంలో తగ్గుతున్న జనాభాను వృద్ధి చేసే ఉద్దేశంతో.. గుజరాత్‌లోని 'కచ్ కడ్వా పాటిదార్ సమాజ్' ఒక సరికొత్త పథకాన్ని ప్రకటించింది. తమ సమాజానికి చెందిన దంపతులు మూడో సంతానానికి జన్మనిస్తే.. వారికి రూ.50 వేల ఫిక్స్‌డ్ డిపాజిట్ బహుమతిగా ఇస్తామని వెల్లడించింది. అంతేకాకుండా, ఆ జంటను ఘనంగా సత్కరిస్తామని తెలిపింది.

దక్షిణ గుజరాత్‌లో ఈ సామాజిక వర్గానికి చెందినవారు దాదాపు 17 వేల మంది ఉన్నారు. అయితే, కొన్నేళ్లుగా వీరి జనాభా క్రమంగా తగ్గుముఖం పడుతోంది. ఇటీవల నిర్వహించిన కేకేపీఎస్ దక్షిణ గుజరాత్ జోనల్ సమావేశంలో ఇదే అంశంపై చర్చ జరిగింది. యువ జంటలు ఒక బిడ్డతో సరిపెట్టుకోవడం, లేదా అసలు సంతానం వద్దనుకోవడం వంటి ధోరణులపై ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో జనాభాను పెంచడంతోపాటు, పెద్ద కుటుంబాలను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ పథకాన్ని ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఆడపిల్ల పుట్టిన కుటుంబానికి అండగా నిలిచేందుకు, సంపాదనపరులు లేని కుటుంబాలను ఆర్థికంగా ఆదుకునేందుకు ఇప్పటికే అనేక పథకాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు.

ఇదే తరహాలో సూరత్ పార్సీ పంచాయత్ కూడా జనాభా ప్రోత్సాహక పథకాన్ని అమలు చేస్తోంది. మూడో బిడ్డను కనే దంపతులకు ఆర్థిక సాయం అందిస్తోంది. ఈ పథకం కింద మూడో బిడ్డకు 25 ఏళ్లు వచ్చే వరకు నెలకు రూ.5,000 చొప్పున అందిస్తున్నామని, దేశవ్యాప్తంగా ప్రస్తుతం 39 జంటలు ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నాయని పంచాయత్ అధ్యక్షుడు డా.హోమీ దూద్‌వాలా వెల్లడించారు.

# తెలంగాణలో నేడు, రేపు భారీ నుంచి అతిభారీ వర్షాలు

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: రాష్ట్రంలో పలుచోట్ల ఈ నెల 24, 25, 26 తేదీల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణశాఖ ఎరుపు రంగు హెచ్చరికలు జారీ చేసింది. బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతూ బుధవారం రాత్రికి ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా తీరాల మధ్య కళింగపట్నం సమీపంలో తీరం దాటే అవకాశం ఉందని తెలిపింది. దీని ప్రభావంతో తెలంగాణలో రానున్న మూడు రోజులు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉంది. గురువారం కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో అతి భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. రాష్ట్రంలో భారీ నుంచి అత్యంత భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించిన నేపథ్యంలో రెడ్ ఎలర్ట్ జారీ చేసిన జిల్లాల కలెక్టర్లు మరింత అప్రమత్తంగా ఉండాలని విపత్తు నిర్వహణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు.

### దానం నాగేందర్‌పై సుప్రీం తీర్పు

# రాజ్యాంగ విజయం:

మొదటిపేజీ తరువాయి



ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. భాజపా చేసిన న్యాయపోరాటం వల్లే ఈ విజయం దక్కిందని చెప్పారు. ఇదే స్ఫూర్తితో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న రాజ్యాంగ వ్యతిరేక చర్యలపై కోర్టులు, క్షేత్రస్థాయిలో పోరాటాలు కొనసాగిస్తామన్నారు. ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని అమలు చేయాల్సిన సీఎం రేవంత్ రెడ్డి.. స్వయంగా ఫిరాయింపులను ప్రోత్సహించడం కంచే చేను మేసిన వైనాన్ని తలపించిందని విమర్శించారు. ఇకనైనా పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలతో రాజీనామాలు చేయించి ఉపఎన్నికకు వెళ్లాలన్నారు.

# కన్‌సాన్‌పల్లిలో రూ.46,800కు లడ్డు వేలం.. కైవసం చేసుకున్న బీఆర్ఎస్ యువ నాయకుడు ధీరజ్‌రెడ్డి

అందోలు, సెప్టెంబర్ 25(సందేశం టైమ్స్ ప్రతినిధి):
అందోలు మండల పరిధిలోని కన్‌సాన్‌పల్లి గ్రామంలోని దుర్గా భవాని ఆలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయక నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా నిర్వహించిన లడ్డు వేలం పాట రికార్డు స్థాయిలో సాగింది. గ్రామ చరిత్రలోనే అత్యధిక ధర పలికిన వినాయక లడ్డుగా నిలిచిన ఈ వేలం పాటలో గ్రామానికి చెందిన బీఆర్ఎస్ యువ నాయకుడు నోమన్నగారి ధీరజ్‌రెడ్డి పాల్గొని రూ.46,800 భారీ ధరకు 10 కిలోల లడ్డును సొంతం చేసుకున్నారు. వేలం పాట ఆద్యంతం పోటాపోటీగా సాగడంతో చివరకు లడ్డు ఎవరికి దక్కుతుందోనన్న ఉత్కంఠ నెలకొంది. ఇద్దరి



మధ్య తీవ్ర పోటీ కొనసాగిన అనంతరం ధీరజ్‌రెడ్డి అత్యధిక ధరకు లడ్డును కైవసం చేసుకున్నారు. గ్రామ చరిత్రలోనే వినాయక లడ్డుకు అత్యధిక ధర పలకడంతో ఈ వేలం పాట గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. లడ్డును దక్కించుకున్న ధీరజ్‌రెడ్డిని ఉత్సవ కమిటీ సభ్యులు శాలువాతో ఘనంగా సత్కరించి లడ్డును అందజేశారు. అనంతరం వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొమ్మిది రోజుల పాటు సాంప్రదాయబద్ధంగా ప్రత్యేక పూజలు నిర్వహించిన ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. నిమజ్జన శోభాయాత్రలో మెదక్ జిల్లా తూప్రాన్ ప్రాంతానికి చెందిన మహిళా డ్యాన్సర్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఫోక్ సాంగ్స్‌తో పాటు భక్తి గీతాలపై మహిళలు చేసిన నృత్యాలు ప్రజలను అలరించాయి. తొలిసారిగా మహిళా డ్యాన్సర్లు వినాయక శోభాయాత్రలో పాల్గొనడంతో వారి నృత్యాలను తిలకించేందుకు గ్రామస్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. యువకులు, చిన్నారులు కేరింతలు కొడుతూ ఉత్సాహంగా శోభాయాత్రలో పాల్గొనడంతో కన్‌సాన్‌పల్లిలో వినాయక నిమజ్జన వేడుకలు సందడిగా సాగాయి.

# సెయింట్ డాన్ బాస్కో పాఠశాలలో ఉచిత దంత వైద్య శిబిరం

జోగిపేట, సెప్టెంబర్ 25 సందేశం టైమ్స్ ప్రతినిధి:
జోగిపేటలోని సెయింట్ డాన్ బాస్కో ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ యాజమాన్యం ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయుల కోసం ఉచిత దంత వైద్య శిబిరం, నోటి ఆరోగ్య అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో డాక్టర్ జి. స్నేహిక, డాక్టర్ ఎ. ప్రేరితతో పాటు వైద్య బృందం పాల్గొని విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించడంతో పాటు నోటి ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. సరైన పద్ధతిలో పళ్లు తోముకునే విధానాన్ని ప్రదర్శించి, ఆహారపు అలవాట్లు, నోటి పరిశుభ్రత తదితర అంశాలపై వైద్యులు పలు సూచనలు అందించారు. ఉపాధ్యాయులకు కూడా ప్రత్యేకంగా నోటి ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాల






నిర్వాహకులు రెవ. ఫాదర్ ఎన్. సురేష్ మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధిలో ఆరోగ్యం ఎంతో ముఖ్యమని, నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు పాఠశాల యాజమాన్యం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. చిన్న వయస్సు నుంచే దంత సంరక్షణపై అవగాహన కల్పించడం ద్వారా పిల్లల్లో ఆరోగ్యకరమైన అలవాట్లు పెంపొందుతాయని పేర్కొన్నారు. ఉచిత దంత వైద్య శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించి విద్యార్థులు, ఉపాధ్యాయుల్లో ఆరోగ్య అవగాహన కల్పించిన డాక్టర్ జి. స్నేహిక, డాక్టర్ ఎ. ప్రేరిత మరియు వారి వైద్య బృందానికి పాఠశాల యాజమాన్యం కృతజ్ఞతలు తెలిపింది. విద్యార్థుల ఆరోగ్యం, సంక్షేమం, సమగ్ర అభివృద్ధికి కృషి చేయడంలో పాఠశాల యాజమాన్యం తన నిబద్ధతను చాటుకుంది.

# వినాయక మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేసిన పట్లోళ్ల వైద్యనాథ్ (రాజు పటేల్)

అందోల్, సెప్టెంబర్ 25 సందేశం టైమ్స్ ప్రతినిధి:
అందోల్ మండలం నేరడిగుంట గ్రామంలో గురువారం వినాయక మండపాల నిర్వాహకుల ఆహ్వానం మేరకు పట్లోళ్ల వైద్యనాథ్ (రాజు పటేల్) పలు వినాయక మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా హనుమాన్ మందిరంలో ఏర్పాటు చేసిన శాంతి క్రాంతి యువజన సంఘం వినాయక మండపంలో పూజలు చేసిన అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించిన యువజన సంఘం నాయకులను శాలువాతో సన్మానించారు. అనంతరం చావిడి



అడ్డ వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవాల నిర్వహణకు తనవంతు సహాయం చేస్తానని యువకులను అడగగా, రెండు యువజన సంఘాల సభ్యులు సుమారు 100 మందికి భోజనాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఇందుకు రాజు పటేల్ వెంటనే అంగీకరించడంతో యువజన సంఘాల ప్రతినిధులు ఆయనను అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ గున్నాల నాగప్ప, సిద్ధారెడ్డి, శ్రీధర్ రెడ్డి, వారాది శంకరప్ప, మైలుగుండ్ల ప్రభాకర్, గొల్ల నాగేందర్, సంగన్న స్వామి, కుమ్మరి సంగమేశ్వర్, వరప్రసాద్, మంతూరి ఎల్లప్ప, బీరప్ప, పండరి, ఆశయ్య, దేవయ్యతో పాటు రెండు సంఘాల ప్రతినిధులు, పూజారి శ్రీకాంత్ స్వామి, కమ్మరి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు కలెక్టర్ అభినందనలు

సంగారెడ్డి, సెప్టెంబర్ 25 - సందేశం టైమ్స్ ప్రతినిధి:
విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి వారిని ప్రోత్సహించేందుకు టూరిజం శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ పోటీల్లో సంగారెడ్డి జిల్లాకు చెందిన పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. పాఠశాల స్థాయిలో జెడ్పీహెచ్ఎస్ గుమ్మడిదల విద్యార్థులు ప్రథమ బహుమతి, జెడ్పీహెచ్ఎస్ (బి) జోగిపేట విద్యార్థులు ద్వితీయ బహుమతి, జెడ్పీహెచ్ఎస్ సింగీతం/కలబ్‌గూర్ విద్యార్థులు తృతీయ బహుమతి సాధించారు. కళాశాల స్థాయిలో సంగారెడ్డిలోని తారా డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రథమ బహుమతి, పటాన్‌చెరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ద్వితీయ బహుమతి, ఎంజేపీటీ కోహీర్ విద్యార్థులు తృతీయ



బహుమతి సాధించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. చదువుతో పాటు వివిధ పోటీలు, సాంస్కృతిక, సృజనాత్మక కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థులు తమ ప్రతిభను మరింతగా పెంపొందించుకోవాలని సూచించారు. భవిష్యత్తులోనూ మరిన్ని పోటీల్లో పాల్గొని ఉన్నత స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచి బహుమతులు సాధించిన విద్యార్థులను కలెక్టర్ అభినందించారు. విజేతలను ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యాశాఖ అధికారులు అభినందించారు. టూరిజం ఇన్‌చార్జి అధికారి కేవీఎస్ ప్రసాద్ రెడ్డి, విద్యాశాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధురాలి అనుమానాస్పద మృతి.. నగల కోసమే హత్య చేశారా?



పుల్కల్, సెప్టెంబర్ 25 సందేశం టైమ్స్ అందోల్ నియోజకవర్గం ఇంచార్జ్ కే. మల్లేశం గౌడ్):
సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలం పెద్దారెడ్డిపేట్ గ్రామంలో కొత్తగాడి పోచమ్మ అనే వృద్ధురాలు అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం కలకలం రేపింది. పోచమ్మ మెడపై గాయాలు, కాట్ల గుర్తులు కనిపించడంతో ఆమెను దుండగులు హత్య చేసి ఉంటారనే అనుమానాలను బంధువులు, స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. నగల కోసమే ఈ ఘటన జరిగిందా, లేక పాత కక్షల నేపథ్యంలో హత్య జరిగిందా అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఘటనపై జోగిపేట సీఐ అనిల్‌కుమార్, పుల్కల్ ఎస్ఐ నల్లా విశ్వంజన్ ఆధ్వర్యంలో పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తు అనంతరం వెల్లడికానున్నాయి.

# భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు పోలీసుల హెచ్చరిక

- అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లొద్దు.. నీటి ప్రాంతాల వైపు వెళ్లి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు

సందేశం టైమ్స్ ఖమ్మం జిల్లా ఇన్చార్జ్ శెట్టి సురేష్:సెప్టెంబర్ 25,
చింతకాని, సెప్టెంబర్ 24: చింతకాని మండలంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రాబోయే రెండు రోజులు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చింతకాని ఎస్సై జి. నరేష్ సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో తప్ప ప్రజలు బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని




కోరారు.చెరువులు, కాలువలు, ఇతర నీటి ప్రాంతాల వద్దకు వెళ్లవద్దని సూచించారు. ముఖ్యంగా పిల్లలను నీటి ప్రాంతాల వైపు వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. వర్షాల కారణంగా రోడ్లపై చెట్లు పడటం,రహదారులకు అడ్డంకులు ఏర్పడటం లేదా నీటి ప్రవాహం కారణంగా రాకపోకలకు అంతరాయం ఏర్పడితే వెంటనే చింతకాని పోలీసులకు సమాచారం అందించాలని ఎస్సై నరేష్ కోరారు.చిన్న చిన్న ఆనందాల కోసం అజాగ్రత్తగా వ్యవహరించి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని, ప్రజల భద్రతే పోలీసుల ప్రథమ కర్తవ్యమని ఎస్సై పేర్కొన్నారు.

# నాగులవంచ బండిరేవు వద్ద వరద ఉధృతి.. రాకపోకలు బంద్

- శాశ్వత వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని స్థానికుల విజ్ఞప్తి



సందేశం టైమ్స్ ఖమ్మం జిల్లా ఇంచార్జ్ శెట్టి సురేష్:చింతకాని 25, సెప్టెంబర్
చింతకాని: మండల పరిధిలోని నాగులవంచ బండిరేవు వద్ద వరద ఉధృతి పెరగడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.నాగులవంచ నుంచి రైల్వే కాలనీ, పాతర్లపాడు, రామాపురం గ్రామాలకు వెళ్లే ప్రధాన మార్గంలో ఈ పరిస్థితి ఏర్పడటంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.వర్షాకాలంలో వాగు ఉధృతంగా ప్రవహించిన ప్రతిసారీ రహదారిపై రాకపోకలు నిలిచిపోతున్నాయని స్థానికులు తెలిపారు. గత రెండేళ్లుగా ఇదే సమస్య పునరావృతమవుతున్నప్పటికీ శాశ్వత పరిష్కారం లభించకపోవడంతో విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, అత్యవసర సేవలకు వెళ్లే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.శాశ్వత వంతెన నిర్మించాలి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చొరవ తీసుకుని నాగులవంచ బండిరేవు వద్ద శాశ్వత వంతెన నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు.వంతెన నిర్మాణం పూర్తయితే నాగులవంచతో పాటు రైల్వే కాలనీ, పాతర్లపాడు, రామాపురం గ్రామాల ప్రజలకు ఏడాది పొడవునా సురక్షిత రాకపోకలు అందుబాటులోకి వస్తాయని వారు పేర్కొన్నారు.

# పట్టోళ్ల మల్లారెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు

మోమిన్‌పేట్, సెప్టెంబర్ 25 (సందేశం టైమ్స్ ప్రతినిధి):



మోమిన్‌పేట్ మండలంలోని చిన్న అమ్రోది గ్రామానికి చెందిన పట్టోళ్ల మల్లారెడ్డి ఈ నెల 25న జన్మదినం జరుపుకుంటున్న సందర్భంగా కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, గ్రామ పెద్దలు, ఆప్తులు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అమ్మానాన్నల ప్రేమానురాగాలు, మేనమామల ఆప్యాయత, తాతయ్యలు, నానమ్మలు, అమ్మమ్మల ఆశీస్సులు, బంధుమిత్రులు, చిన్నాపెద్దల ప్రేమాభిమానాలతో మల్లారెడ్డి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తూ మరిన్ని విజయాలు సాధించాలని కోరుకున్నారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో పట్టోళ్ల చెన్నారెడ్డి, పట్టోళ్ల మౌనిక, పట్టోళ్ల అక్షిత్‌రెడ్డితో పాటు మేనమామలు గడ్డం మల్లారెడ్డి--సరిత, గడ్డం నాగిరెడ్డి--లలిత, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు తదితరులు ఉన్నారు.

# పెద్దారెడ్డిపేట్‌లో ఘనంగా బలరాం భగవాన్ జయంతి వేడుకలు



పుల్కల్, సెప్టెంబర్ 25 (సందేశం టైమ్స్ అందోల్ నియోజకవర్గ ఇంచార్జ్ కే. మల్లేశం గౌడ్):

బలరాం భగవాన్ జయంతి వారోత్సవాల సందర్భంగా భారతీయ కిసాన్ సంఘ్ పిలుపు మేరకు రైతు దినోత్సవాన్ని సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలం పెద్దారెడ్డిపేట్ గ్రామంలో ఘనంగా నిర్వహించారు. భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా ఉపాధ్యక్షులు వి. యాదగిరిరెడ్డి, గ్రామ అధ్యక్షులు పి. శేఖర్ ఆధ్వర్యంలో జెండా ఎగురవేసి రైతు దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు వి. యాదగిరిరెడ్డి మాట్లాడుతూ పెరుగుతున్న పెట్టుబడుల దృష్ట్యా రైతులకు లాభసాటి ధరలు ప్రకటించి అన్ని పంటలను ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. చెరకు టన్నుకు రూ.5,000 ధరను గణపతి షుగర్స్ ప్రకటించాలని, వ్యవసాయానికి రాత్రి 12 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు 18 గంటల పాటు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని కోరారు. బ్యాంకుల విలీనం కారణంగా ఐఎఫ్ఎస్‌సీ కోడ్ మారడంతో ప్రభుత్వం మంజూరు చేసిన రైతు రుణమాఫీ నిధులు రైతుల ఖాతాల్లో జమ కాకుండా తిరిగి ప్రభుత్వానికి వెళ్లాయని, దీంతో రైతులకు నష్టం జరిగిందని పేర్కొన్నారు. రైతుల ఖాతాల్లో రుణమాఫీ నిధులను తిరిగి జమ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామ రైతులు, గ్రామ ప్రతినిధులు పి. ఆంజనేయులు, యాదయ్య, ఎల్లాగౌడ్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బలరాం భగవాన్ జయంతి వేడుకలు

సందేశం టైమ్స్ అందోల్ నియోజకవర్గం ఇంచార్జ్ కే మల్లేశం గౌడ్



బలరాం భగవాను జయంతి వారోత్సవ సందర్భంగా, రైతు దినోత్సవం జరపాలని భారతీయ కిసాన్ సంఘ్ పిలుపు మేరకు, ఈ రోజు సంగా రెడ్డి జిల్లా, పుల్కల్ మండలం పెద్దారెడ్డి పేట్ గ్రామం లో జిల్లా భారతీయ కిసాన్ సాంఘ్ ఉపాధ్యక్షులు జ. యాదగిరి రెడ్డి, భారతీయ కిసాన్ సాఘ్ గ్రామ అధ్యక్షులు ్రా. శేకర్ గారల ఆధ్వర్యంలో రైతు దినోత్సవం, జెండా ఎగురవేసి ఘనంగా జరుపు కున్నాము. రైతు దినోత్సవం లో జిల్లా ఉపాధ్యక్షులు ఎ. యాదగిరి రెడ్డి గారు మాట్లాడుతూ, పెట్టు బడులు రెట్టిశీప్పుగా పెరిగి నందున, రైతు కు లాభ సాటి ధర ప్రకటిశీచ్చి, అన్ని పంటలు ప్రభుత్వం కొనుగోలు చేయాలనీ చెరకు టన్ను ధర రూపాయలు 5000/-లు, గణపతి షుగర్స్ ప్రకటిశీచ్చాలని వ్యవసాయానికి, రాత్రి 12నుండి సాయంత్రం 6గంట ల వరకు, 18గంట ల నిరంతర,మరియు నాణ్యమైన విద్యుత్ సరఫరా ఇవ్వాలని డిమాండు చేసారు బ్యాంకుల విలీనం వల్ల ×ఖీూజ కోడ్ మారడం వల్ల,ప్రభుత్వం నుండి వచ్చిన రైతు ఋుణ మా ఫీ డబ్బులు రైతు ఖాతా లో జమ కాక మళ్ళీ తిరిగి ప్రభుత్వానికి వెళ్లాయి. రైతుకు మోసం జరిగింది. ఇట్టి మాఫీ డబ్బులు రైతు ఖాతా లో వేయాలని డిమాండు చేసారు.,సమావేశం లో పెద్దఎత్తున గ్రామ రైతులు, మరియు గ్రామ ప్రతి నిధులూ. ఆంజనేయులు, యాదయ్య, ఎల్లాగౌడు గారలు పాల్గొనిరి. శేకర్, అధ్యక్షులు, భారతీయ కిసాన్ సాంఘ్ పెద్దరెడ్డి పేట్, గ్రామం

# డప్పుల దరువులు.. సంప్రదాయ నృత్యాలతో గణేష్ నిమజ్జన శోభాయాత్ర..

**-డీజేలకు దూరంగా ప్రశాంత వాతావరణంలో వేడుకలు.. పోలీసుల బందోబస్తుపై ప్రజల హర్షం**

**-డ్రోన్, సీసీ కెమెరాలతో నిఘా**

**-కాలినడకన నిమజ్జన రూట్‌ను పర్యవేక్షించిన ఎస్పీ**

సెప్టెంబర్ 25 సందేశం టైమ్స్

కామారెడ్డి పట్టణంలో గణేష్ నిమజ్జన శోభాయాత్ర గురువారం భక్తిశ్రద్ధలు, డప్పుల దరువులు, డోలు బ్యాండ్లు, సంప్రదాయ నృత్యాల నడుమ అంగరంగ వైభవంగా కొనసాగింది. గణనాథుడి శోభాయాత్రను తిలకించేందుకు ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావడంతో పట్టణమంతా పండుగ వాతావరణం నెలకొంది.నిమజ్జన కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, ఐపీఎస్ స్వయంగా పర్యవేక్షించారు. డ్రోన్ కెమెరాలు, సీసీ కెమెరాల ద్వారా భద్రతా ఏర్పాట్లను నిరంతరం పరిశీలించడంతో పాటు, కాలినడకన నిమజ్జన రూట్‌లో పర్యటించి పోలీసు అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. గణేష్ మండపాల నిర్వాహకులను కలిసి శోభాయాత్ర సజావుగా సాగేందుకు సహకరించాలని కోరారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతో నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా కొనసాగుతోంది. నిర్వాహకులు, భక్తులు, ప్రజలు పోలీసులకు అందిస్తున్న సహకారం అభినందనీయమని ఎస్పీ తెలిపారు. అందరి సమన్వయంతోనే నిమజ్జన వేడుకలు ప్రశాంత వాతావరణంలో కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.డీజేలు లేకపోవడంపై ప్రజల హర్షం నిమజ్జన శోభాయాత్రను తిలకించేందుకు తరలివచ్చిన ప్రజలు డీజే శబ్దాలు లేకుండా సంప్రదాయ పద్ధతిలో శోభాయాత్ర కొనసాగడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. డీజే సౌండ్ లేకపోవడంతో కుటుంబ సభ్యులతో కలిసి ప్రశాంతంగా వేడుకలను వీక్షించే అవకాశం కలిగిందని పలువురు తెలిపారు. ప్రజల భద్రత, ప్రశాంతతను దృష్టిలో ఉంచుకుని పోలీసులు తీసుకున్న చర్యలపై అభినందనలు వ్యక్తం చేశారు. నిమజ్జన శోభాయాత్రను తిలకించే ప్రజలు రోడ్లపై గుమిగూడకుండా తగిన



జాగ్రత్తలు పాటించాలని ఎస్పీ సూచించారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పోలీసుల సూచనలకు సహకరించాలని కోరారు. భక్తి, సంప్రదాయం, ఆనందోత్సాహాల మధ్య గణేష్ నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, సురక్షితంగా ముగిసేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కే. నర్సింహారెడ్డి, కామారెడ్డి డీఎస్పీ ఎస్. మధుసూదన్, ఇతర డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బాన్సువాడలో జర్నలిస్టులకు రెండు రోజుల శిక్షణ..

**-సెప్టెంబర్ 29, 30 తేదీల్లో నిర్వహణ**

సెప్టెంబర్ 25 సందేశం టైమ్స్

కామారెడ్డి జిల్లా బాన్సువాడలోని ఎస్.ఆర్.ఎన్.కె. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సెప్టెంబర్ 29, 30 తేదీల్లో తెలంగాణ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు రెండు రోజుల ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు మీడియా అకాడమీ కార్యదర్శి నాగుల్లపల్లి వెంకటేశ్వరరావు తెలిపారు.

శిక్షణ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు, చర్చించనున్న అంశాలు, జర్నలిస్టులకు అందించనున్న శిక్షణ వివరాలను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్‌కు కార్యదర్శి నాగుల్లపల్లి వెంకటేశ్వరరావు, ఛైర్మన్ ఓఎస్డీ రహ్మాన్, మేనేజర్ శైలేష్ రెడ్డి వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను కలిసి శిక్షణ కార్యక్రమానికి ఆహ్వానించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి పాల్గొన్నారు.



ఈ సందర్భంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న వృత్తిపరమైన సమస్యలు, అవసరాలను కూడా మీడియా అకాడమీ కార్యదర్శి కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.రెండు రోజుల శిక్షణలో సమాచార హక్కు చట్టం, వార్తల్లో తప్పొప్పుల పరిశీలన, నేర వార్తల కవరేజ్, వార్తా కథనాల రూపకల్పన, వార్తా సేకరణ, వార్తల ప్రాధాన్యత నిర్ణయం, వాస్తవ నిర్ధారణ, మీడియా చట్టాలు--నైతిక నియమాలు, జర్నలిజంలో పాటించాల్సిన వృత్తిపరమైన ప్రమాణాలు తదితర అంశాలపై నిపుణులు శిక్షణ అందించనున్నారు.జర్నలిజం రంగంలో వేగంగా చోటుచేసుకుంటున్న మార్పులకు అనుగుణంగా జర్నలిస్టుల వృత్తి నైపుణ్యాలను పెంపొందించడమే శిక్షణ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని వెంకటేశ్వరరావు తెలిపారు. శిక్షణ ద్వారా పొందే జ్ఞానం జర్నలిస్టులకు రోజువారీ వృత్తి విధుల్లో మరింత సమర్థవంతంగా పనిచేసేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు.రెండు రోజుల శిక్షణ ముగింపు కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్‌ను ఆహ్వానించగా, హాజరై జర్నలిస్టులను ఉద్దేశించి మాట్లాడేందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో జర్నలిస్టుల వృత్తి నైపుణ్యాలను పెంపొందించే లక్ష్యంతో తెలంగాణ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో ఇటువంటి శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి తెలిపారు.

# దోమకొండ ఎక్సైజ్ సీఐగా సర్వేశ్వర్ రావు..

**- కరాటేలో 6వ డాన్ బ్లాక్ బెల్ట్..**
**యువతకు పోటీ పరీక్షల్లో ఉచిత శిక్షణ**

సెప్టెంబర్ 25 సందేశం టైమ్స్

కామారెడ్డి జిల్లా దోమకొండ మండల కేంద్రంలోని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ సీఐగా సర్వేశ్వర్ రావు బాధ్యతలు స్వీకరించారు. సెప్టెంబర్ 3న బదిలీపై దోమకొండకు వచ్చిన ఆయనకు పోలీసు, ఎక్సైజ్ శాఖల్లో 17 ఏళ్లకు పైగా విధులు నిర్వహించిన అనుభవం ఉంది.సర్వేశ్వర్ రావు ఎం.కామ్, బీఈడీ విద్యార్హతలు పూర్తి చేశారు. 2009 బ్యాచ్‌లో ఎస్సైగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించిన ఆయన 2014 వరకు ఎస్సైగా విధులు నిర్వర్తించారు. అనంతరం 2014 నుంచి 2024 వరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐగా పనిచేశారు. 2024 నుంచి 2026 ఫిబ్రవరి వరకు జగిత్యాల జిల్లాలో ఎస్‌హెచ్‌ఓగా సేవలందించారు.యువతకు ఉచిత శిక్షణ విధి నిర్వహణతో పాటు యువతకు ఉపయోగపడే కార్యక్రమాలపై కూడా సర్వేశ్వర్ రావు ఆసక్తి చూపుతున్నారు. తన స్నేహితులు, సహచర అధికారులు, వారి పిల్లలకు పోటీ పరీక్షలకు ఉచితంగా శిక్షణ అందించడంతో పాటు ఫిజికల్ ట్రైనర్‌గా శిక్షణ ఇచ్చిన అనుభవం ఉందని తెలిపారు. యువత పోటీ పరీక్షలకు సిద్ధమవుతూనే శారీరక దారుఢ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.కరాటేలో 6వ డాన్ సర్వేశ్వర్ రావుకు క్రీడలు, మార్షల్ ఆర్ట్స్‌పై ప్రత్యేక ఆసక్తి ఉంది. కరాటేలో బ్లాక్ బెల్ట్ సాధించిన ఆయన 6వ డాన్ స్థాయి అర్హతను పొందారు. యువతలో క్రమశిక్షణ, శారీరక దారుఢ్యం పెంపొందించడంతో పాటు పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే వారికి తనవంతు సహకారం అందించాలనే ఉద్దేశంతో ఉన్నట్లు




తెలిపారు.అక్రమ మద్యం నియంత్రణపై ప్రత్యేక దృష్టి దోమకొండ మండల పరిధిలో ఎక్సైజ్ శాఖకు సంబంధించిన విధులను సమర్థవంతంగా నిర్వహిస్తామని సీఐ సర్వేశ్వర్ రావు తెలిపారు. అక్రమ మద్యం, గుడుంబా తయారీ, విక్రయాలు తదితర కార్యకలాపాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారిస్తామని పేర్కొన్నారు.

# భారీ ధర పలికిన గణనాథుడి లడ్డూ..

**-రూ.24,011లకు లడ్డూను కైవసం చేసుకున్న ప్రశాంత్, వైష్ణవి, రివ పటేల్**

సెప్టెంబర్ 25 సందేశం టైమ్స్

గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా బిచ్కుంద పట్టణంలోని వడ్లగల్లిలో గణనాథుడి లడ్డూ వేలం పాటను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. యువ భారత్ గణేష్ మండలి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేలం పాటలో లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకునేందుకు భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు.వేలం పాటలో ప్రశాంత్, వైష్ణవి, రివ పటేల్ రూ.24,011లకు లడ్డూను కైవసం చేసుకున్నారు. అనంతరం మండలి సభ్యులు, భక్తులు విజేతలను అభినందించి లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు. భక్తుల జయజయధ్వానాల మధ్య వేలం కార్యక్రమం ఘనంగా ముగిసింది.



PRGI - TGTEL/25/A0348
జాతీయ తెలుగు దినపత్రిక
Published by తెలంగాణ - ఆంధ్ర ప్రదేశ్
సందేశం టైమ్స్
నిజం దాగదు - వార్త ఆగదు
25-09-2026

# గణేష్ నిమజ్జనాలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

**- జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్..**

సెప్టెంబర్ 25 సందేశం టైమ్స్



గణేష్ నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. గురువారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని టేక్రియాల్ చెరువులో జరుగుతున్న గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా చెరువు వద్ద నిమజ్జనం కోసం చేపట్టిన ఏర్పాట్లు, భద్రతా చర్యలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. టేక్రియాల్ చెరువులో సుమారు 700కు పైగా గణేష్ విగ్రహాలు నిమజ్జనం చేసే అవకాశం ఉన్నందున, పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని ఏర్పాట్లు పటిష్టంగా ఉండాలని సూచించారు. చెరువు వద్ద పటిష్టమైన బారికేడింగ్ ఏర్పాటు చేయాలని, అనుమతి లేని వ్యక్తులు నీటిలోకి వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విగ్రహాల నిమజ్జనం కోసం పెద్ద క్రేన్లు, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. వాటర్‌ప్రూఫ్ షామియానా ఏర్పాటు చేసి, రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్, అగ్నిమాపక శాఖల సమన్వయంతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని తెలిపారు. విద్యుత్ వైర్లు విగ్రహాలకు తగలకుండా తగిన ఎత్తులో ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన ప్రాంతాల్లో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. అధిక సంఖ్యలో విగ్రహాలు నిమజ్జనానికి వచ్చే నేపథ్యంలో చెరువు వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. విగ్రహాలు వరుస క్రమంలో నిమజ్జనం అయ్యేలా తహసీల్దార్, పోలీస్, మున్సిపల్, ఇరిగేషన్, అగ్నిమాపక తదితర శాఖల అధికారులు సమన్వయంతో నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. భక్తులు, ప్రజలు నిమజ్జన కార్యక్రమంలో జాగ్రత్తలు పాటిస్తూ అధికారులకు సహకరించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ కోరారు.

# హార్వెస్టింగ్ పాండ్‌ను పరిశీలించిన కలెక్టర్..

సెప్టెంబర్ 25 సందేశం టైమ్స్



కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలం మీశన్‌పల్లి గ్రామంలో నిర్మించిన హార్వెస్టింగ్ పాండ్‌ను జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ గురువారం పరిశీలించారు. పాండ్ నిర్మాణం, నీటి నిల్వ సామర్థ్యం, అందుబాటులో ఉన్న సౌకర్యాలు, వినియోగం తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పాండ్ వద్ద ఉపాధి హామీ కూలీలకు తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయా అని కలెక్టర్ ఆరా తీశారు. పని ప్రదేశంలో కూలీలకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. వర్షపు నీటిని సమర్థవంతంగా ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించడంతో పాటు వ్యవసాయ అవసరాలకు ఉపయోగపడేలా హార్వెస్టింగ్ పాండ్‌లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో చేపడుతున్న నీటి సంరక్షణ పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రోడ్డ ప్రభాకర్, డీఆర్‌డీఓ దామోదర్, ఎంపీడీవో తహీరా బేగమ్, తహసీల్దార్ ప్రేమ్, మండల స్పెషల్ ఆఫీసర్ నరసయ్య, సర్పంచ్, ఉప సర్పంచ్, ఏపీవో తదితర అధికారులు పాల్గొన్నారు.

# కనీస వేతనాల జీవో 6 అమలకై ఉద్యమించండి...

**- టి యు సి ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు జి రామయ్య పిలుపు**

సెప్టెంబర్ 25 సందేశం టైమ్స్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన 6 స్ర్శీ వెంటనే అన్ని రంగాల కార్మికులకు వర్తింపచేయాలని టి యు సి ఐ ఆధ్వర్యంలో (గురువారం) బైపాస్ రోడ్ లో కరపత్రాన్ని విడుదల చేశారు, ఈ సందర్భంగా జి రామయ్య మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం 2026 జూన్ ఒకటో తారీకు నుంచి అమలు చేయాలని విడుదల చేసి కోటి మంది పైగా కార్మికులకు లబ్ధి పొందుతున్నారని ప్రకటించడం, ఈ ప్రకటనలు కాగితాలకే పరిమితమైన అని వారు ఆరోపించారు, ఆనాటి కెసిఆర్ నేటి రేవంత్ రెడ్డి ప్రభుత్వాలు పారిశ్రామికవేతలకు అనుగుణంగా వ్యవహరిస్తున్నారు తప్ప సంపదకి సృష్టికర్తలైన కార్మికులకు పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు జీవోలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమయ్యారని వారు విమర్శించారు, రాష్ట్ర ప్రభుత్వం 6 జీవో అమలు చేయాలని ఈనెల 25 నుంచి 30 వరకు అన్ని రంగాల కార్మికుల వద్ద ఆందోళనలో నిర్వహించాలని ప్రదర్శనలు జరపాలని టి యు సి ఐ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఈ ఆందోళనలో అన్ని రంగాల కార్మికుల భాగస్వాములు కావాలని వారు కోరారు, కనీస వేతనాల జీవోలో జోన్స్ గా విభజించటం గత జీవోలలో అన్నిటిని జోన్స్ లేవు కానీ నేటి జీవోలలో జోన్స్ గా నిర్ధారించడం సరి అయింది కాదని దీనివలన కార్మికులు తీవ్ర నష్టం జరుగుతుందని వారన్నారు, కార్మిక వర్గం అప్పు చేసి పప్పుకూడు తినవలసిన స్థితికి ఈ ఈ జీవోల వల్ల వచ్చిందని, ముఖ్యంగా పట్టణ కార్మికుడికైనా గ్రామీణ, మున్సిపాలిటీ, కార్మికుల కైనా సరుకుల ధరలు ఒకే రకంగా ఉంటాయని వారు అన్నారు, కావున వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రకారంఅన్ని రంగాల కార్మికులకు




ఎటువంటి మినహాయింపు లేకుండా అమలు చేసి కార్మికులను కార్మిక కుటుంబాలను ఆదుకోవాలని ఈ సందర్భంగా జరిగే దశల వారి ఆందోళనలో అన్ని రంగాల కార్మికులు పాల్గొని జీవో అమలు కోసం ప్రభుత్వంపైఒత్తిడి చేయాలని వారు కోరారు, ఈ కార్యక్రమంలో లిటి యు సి ఐ నగర కార్యదర్శి కే శ్రీనివాస్ నగర్ నాయకులు సైదులు, ప్రభాకర్, రవీందర్, రవి, చందు, తదితరులు పాల్గొన్నారు

# రెడ్‌క్రాస్ జిల్లా శాఖ ఎన్నికలకు 31 నామినేషన్లు..

సెప్టెంబర్ 25 సందేశం టైమ్స్



ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కామారెడ్డి జిల్లా శాఖ మేనేజింగ్ కమిటీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ గురువారం కామారెడ్డి కలెక్టరేట్‌లో నిర్వహించారు. మొత్తం 15 మేనేజింగ్ కమిటీ సభ్యుల పదవులకు 31 నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం సెప్టెంబర్ 25న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నామినేషన్ల పరిశీలన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే సెప్టెంబర్ 26న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియను నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు ఎన్నికల అధికారి పి. రామమోహన్ వెల్లడించారు.

# గోండి భాషపరిరక్షణకు వర్క్‌షాప్‌గోండి భాషకు 8వ షెడ్యూల్‌లో గుర్తింపు కల్పించాలి

**- భాషా సంస్కృతి పరిరక్షణకు అందరూ కృషి చేయాలి**

సెప్టెంబర్ 25 సందేశం టైమ్స్

అక్టోబర్ 2 నుంచి భద్రాచలంలో గోండి భాష వర్క్‌షాప్ భావితరాలకు గోండి భాషను అందించడమే లక్ష్యం..: ఆదివాసీల భాష, సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించి భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆదివాసీ సంక్షేమ పరిషత్ భద్రాద్రి జిల్లా అధ్యక్షులు వి.సి. దొర, కోశాధికారి సోలం రామారావు అన్నారు. గోండి భాషను భవిష్యత్ తరాలకు అందించాలనే లక్ష్యంతో అక్టోబర్ 2 నుంచి 6వ తేదీ వరకు భద్రాచలంలోని గిరిజన భవన్‌లో గోండి భాష వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు



తెలిపారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్ 3898/90, గోటుల్ గోండ్వానా అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో గోండి భాష పరిరక్షణ, అభివృద్ధి, భావితరాలకు భాషను అందించే అంశాలపై చర్చలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గోండి భాషకు రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో అధికారిక గుర్తింపు కల్పించి చేర్చాలనే డిమాండ్‌తో భాషా పరిరక్షణ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. గోండి భాషపై ఆసక్తి ఉన్న ఆదివాసీ యువత, విద్యార్థులు, భాషాభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వర్క్‌షాప్‌ను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే, జడ్పీ చైర్మన్ డాక్టర్ చందా లింగయ్య దొరను నిర్వాహకులు సాధారణంగా ఆహ్వానించారు. ఆదివాసీ భాష, సంస్కృతి పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు....

# నకిలీ నంబర్ ప్లేట్‌తో వాహనం. ఇద్దరిపై కేసు

**- చాసిస్ నంబర్ పరిశీలనతో అసలు విషయం వెలుగులోకి**

మెదక్ సెప్టెంబర్ 25 సందేశం టైమ్స్ మెదక్ ప్రతినిధి




కౌడిపల్లి: ధర్మసాగర్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో నకిలీ నంబర్ ప్లేట్‌తో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరిని గుర్తించి కేసు నమోదు చేసినట్లు కౌడిపల్లి ఎస్ఐ అమర్ తెలిపారు. ఎస్ఐ అమర్ వివరాలు వెల్లడిస్తూ.. సిబ్బందితో కలిసి ధర్మసాగర్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా జంగం శ్రీశైలం, రవీందర్ యాక్టివా వాహనంపై వచ్చినట్లు తెలిపారు. వాహన నంబర్ ప్లేట్‌పై ఉన్న నంబర్‌కు సంబంధించిన చలాన్ల వివరాలను పరిశీలించగా సమాచారం లభించలేదన్నారు. దీంతో అనుమానం వచ్చి వాహనం చాసిస్ నంబర్ ఆధారంగా వివరాలు సేకరించగా, చాసిస్ నంబర్‌కు సంబంధించిన రిజిస్ట్రేషన్ నంబర్ వేరుగా ఉన్నట్లు గుర్తించామన్నారు. అసలు వాహన యజమానికి శ్రీశైలం, రవీందర్‌లతో ఎలాంటి సంబంధం లేదని విచారణలో తేలిందని తెలిపారు. నకిలీ నంబర్ ప్లేట్ ఉపయోగించిన ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అమర్ పేర్కొన్నారు.

# నార్లాపూర్‌లో ఘనంగా పోషణ మాసం

**పోషకాహారంతోనే ఆరోగ్యకరమైన జీవనం..**

సెప్టెంబర్ 25 సందేశం టైమ్స్



మెదక్ జిల్లా నిజాంపేట మండల పరిధిలోని నార్లాపూర్ అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లులు వివిధ రకాల పోషక విలువలతో కూడిన వంటకాలను తయారు చేసి ప్రదర్శించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఐసీడీఎస్ సూపర్వైజర్ లక్ష్మి మాట్లాడుతూ.. చిన్నారుల నుంచి పెద్దల వరకు ప్రతి ఒక్కరూ ఆకుకూరలు, పండ్లు, కూరగాయలు, చిరుధాన్యాలు తదితర పోషకాహారాన్ని తీసుకోవాలని సూచించారు. సమతుల్య ఆహారంతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండేందుకు పోషకాహారంపై అవగాహన పెంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ స్వప్న, వార్డు సభ్యులు, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, ఆశా వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ముగిసిన మాణిక్ ప్రభు మందిర వినాయక నిమజ్జనోత్సవం

- డీజే లేకుండా.. భక్తి భజనలతోనే శోభాయాత్ర
- పెద్ద చెరువులో గంగమ్మ ఒడికి చేరిన గణనాథుడు





సెప్టెంబర్ 25 సందేశం టైమ్స్

ఆందోల్ నియోజకవర్గం ఆందోల్ మండల కేంద్రమైన జోగిపేట మున్సిపాలిటీ పట్టణంలో వినాయక నిమజ్జన వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా ముగిశాయి. పట్టణంలోని మాణిక్ ప్రభు మందిరంలో ప్రతిష్టించిన గణనాథుడిని బుధవారం రాత్రి అంగరంగ వైభవంగా నిమజ్జనం చేశారు. జోగిపేటలో ఎన్నో సంవత్సరాలుగా కొనసాగుతున్న సంప్రదాయం ప్రకారం, చవితి నాడు ప్రతిష్టించిన వినాయకుడిని నిమజ్జనం రోజున ఎలాంటి డీజే శబ్దాలు, నృత్యాలు లేకుండా కేవలం భక్తి బృందాల భజనలతో, కోలాట నృత్యాలతో ఊరేగించడం ఆనవాయితీ. అదే సంప్రదాయాన్ని ఈ ఏడాదీ కొనసాగిస్తూ భక్తులు గణపతిని ఆందోల్ పెద్ద చెరువు వరకు శోభాయాత్రగా తీసుకెళ్లి గంగమ్మ ఒడిలో నిమజ్జనం చేశారు. మందిర పూజారి రమణ పంతులు ఆధ్వర్యంలో తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలు, నిత్య భజన కార్యక్రమాలు నిర్వహించారు. పదవ వార్డు కౌన్సిలర్ పట్లోళ్ల రేఖా ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో వార్డు భక్తులు ప్రతిరోజూ భజనల్లో పాల్గొన్నారు. నాందేడ్ నుండి వచ్చిన ప్రత్యేక భజన బృందం భక్తి పాటలతో భక్తులను భక్తి పారవశ్యంలో ముంచెత్తింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ కృష్ణారెడ్డి, మాజీ చైర్మన్ కవిత సురేందర్ గౌడ్, పదవ వార్డు కౌన్సిలర్ పట్లోళ్ల రేఖా ప్రవీణ్ కుమార్, కాంగ్రెస్ నాయకులు సురేందర్ గౌడ్, గుర్రపు కృష్ణ, కోరబోయిన నాగరాజు (నాని), సురోత్తం రెడ్డి, తుపాకుల సునీల్ కుమార్, ఆత్మ కమిటీ-చేనేత సొసైటీ డైరెక్టర్ చిట్యాల మధు,కాలనీ పెద్దలు, మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్ల పంపిణీ..




సెప్టెంబర్ 25 సందేశం టైమ్స్

మెదక్ జిల్లా నిజాంపేట మండల పరిధిలోని నస్కల్ గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన స్కూల్ యూనిఫామ్లను గురువారం పంపిణీ చేశారు. స్థానిక సర్పంచ్ నాతి అంజమ్మ లక్ష్మాగౌడ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యం రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు యూనిఫామ్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన విద్య, టిఫిన్, మధ్యాహ్న భోజనం, స్కూల్ యూనిఫామ్లు వంటి సౌకర్యాలను కల్పిస్తోందన్నారు. పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి మమత, ఉప సర్పంచ్ దేవరాజ్, వార్డు సభ్యులు రహీం, డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దుబాసి సంజీవ్, మండల మైనార్టీ శాఖ అధ్యక్షుడు సులేమాన్, దేశెట్టి శ్రీనివాస్, ఎల్లారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఏకదంతా.. నమోస్తుతే అట్టహాసంగా అన్నప్రసాద వితరణ..



సెప్టెంబర్ 25 సందేశం టైమ్స్

మండల కేంద్రం పాపన్నపేటలో హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. పాత పోస్టాఫీస్ సమీపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో కొలువుదీరిన గణనాథుడికి అర్చకులు దిగంబర శర్మ ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. గురువారం దాత శ్రీరాం సురేష్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు క్రీడా పోటీలు నిర్వహించి, విజేతలకు ప్రోత్సాహకాలు అందించారు. అనంతరం ఎల్ఈడీ తెరపై 'ఇరుముడి' సినిమాను ప్రదర్శించారు. ఈ కార్యక్రమాల్లో హనుమాన్ యూత్ సభ్యులు శ్రీకాంత్, దుర్గేష్, యాదగిరి, అంబాజీ, శివగౌడ్, నవీన్, శ్రీను, దశరథ్, కృష్ణ, బేతయ్య తదితరులు పాల్గొన్నారు.

# గిరిజనుడు గొల్లి శెట్టి నాగు మృతి పై ఉన్నత స్థాయి విచారణ చెయ్యాలి...తుడుం దెబ్బ

సెప్టెంబర్ 25 సందేశం టైమ్స్

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం జమ్మిగూడెం గ్రామానికి చెందిన ఆదివాసీ గొల్లిశెట్టి నాగు మృతికి సంబంధించిన ఘటనపై సమగ్ర ఉన్నత స్థాయి విచారణ జరిపించాలని,ఆయన మరణానికి కారణమైన పోలీస్ అధికారులపై చట్టపరమైన మరియు శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని తుడుం దెబ్బ నాయకులు బండారి సూర్యనారాయణ డిమాండ్ చేశారు,గొల్లిశెట్టి నాగు మృతి కేసుపై తక్షణమే ఉన్నత స్థాయి కమిటీ లేదా ఐజీ స్థాయి అధికారి ద్వారా పారదర్శక విచారణ చేపట్టాలి? నాగును



వేధింపులకు గురిచేసిన వారిపై ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసులతో పాటు సంబంధిత చట్టాల కింద కేసులు నమోదు చేసి,వారిని వెంటనే సస్పెండ్ చేయాలి,మృతుని కుటుంబానికి ప్రభుత్వ పరంగా తగిన ఎక్స్‌గ్రేషియా చెల్లించి కుటుంబాన్ని ఆదుకోవాలని,ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన,బలహీన వర్గాల ప్రజలపై జరుగుతున్న పోలీస్ వేధింపులు మరియు అక్రమ కేసుల నమోదును వెంటనే నిలిపివేయాలి,? ఈ విషయంలో ప్రభుత్వంతో పాటు పోలీస్ శాఖ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి బాధితుడి కుటుంబానికి పూర్తి స్థాయిలో న్యాయం చేయాలని లేని యడల ఆదివాసి సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమం ఉధృతం చేస్తామని తుడుం దెబ్బ నాయకులు తెలిపారు,ఈ కార్యక్రమంలో తుడుం దెబ్బ రాష్ట్ర నాయకులు బండారి సూర్యనారాయణ,జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తంబళ్ల రవి,వాసం పోలయ్య పాల్గొన్నారు.

# సహకార బ్యాంకు ద్వారా రైతులకు రుణ సదుపాయం.

- పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల
- పాల్వంచ సహకార సంఘం, పాలకవర్గం సమావేశంలో కొత్వాల

సెప్టెంబర్ 25 సందేశం టైమ్స్

పాల్వంచ మండలంలోని రైతులకు కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ) ద్వారా రుణ సదుపాయం కల్పించనున్నారని పాల్వంచ కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులు, డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్, రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. బుధవారం సొసైటీ కార్యాలయంలో పాలకవర్గం సభ్యులు, సహకార బ్యాంక్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ డీసీసీబీ ద్వారా రైతులకు లిదీర్ఘకాలిక రుణాలు (ఎల్.టి. లోన్స్) ఎకరానికి 5.00 లక్షల వరకు 10.5 శాతం వడ్డీపై ఇవ్వనున్నారని అన్నారు. దీర్ఘకాలిక రుణాలలో ట్రాక్టర్లు, గేదెలు, మేకలు, గొర్రెలు వంటి వాటికి ఇవ్వనున్నారన్నారు. మండలంలోని (రూరల్) రైతులకు 30.00 లక్షల రూ॥లు వరకు, గృహ నిర్మాణాలకు 11.00 శాతం వడ్డీపై రుణాలు ఇవ్వనున్నారని అన్నారు. మండలంలోని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కొత్వాల అన్నారు. ఈ సమావేశంలో డీసీసీబీ బ్యాంక్ మేనేజర్ ఎ. స్వప్న, సూపర్వైజర్ ఎస్. పూర్ణచందర్ రావు, ఎఫ్.ఎల్.సి వెంకటేశ్వర్లు,



సొసైటీ డైరెక్టర్లు బుడగం రామమోహన్ రావు, కనగాల నారాయణరావు, జరబన సీతారాంబాబు, చౌగాని పాపారావు, సొసైటీ సి.ఇ.ఓ. జి. లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# విఘ్నేశ్వరుడిని దర్శించుకున్న బి.ఆర్.ఎస్. పార్టీ జిల్లా నాయకులు సోయం వీరభద్రం



సెప్టెంబర్ 25 సందేశం టైమ్స్

గణేష్ నవరాత్రి ఉత్సవాల వెంకటద్రిగూడెం లో విఘ్నేశ్వరుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించినా జిల్లా భా.ర.స నాయకులు సోయం వీరభద్రం దమ్మపేట (మండలం) వెంకటద్రిగూడెం (గ్రామం) లో వినాయక నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులను బి.ఆర్.ఎస్. పార్టీ జిల్లా నాయకులు సోయం వీరభద్రం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయకుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. .ఈ కార్యక్రమంలో చవ్వా అయ్యప్ప,ఎలికె.శ్రీను, లోకేష్,కోటేశ్వరరావు,సోయం ఎర్రయ్య,బుద్దుల కృష్ణ పాల్గొన్నారు

# నవతెలంగాణ పత్రికలో వచ్చిన "ఇందిరమ్మ ఇళ్ల బిల్లుల కోసం లబ్ధిదారుల ఎదురుచూపులు" వార్తపై వివరణ

- గీసుగొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దాడి శివ ప్రకటన

సెప్టెంబర్ 25 సందేశం టైమ్స్

నిన్నటి నవతెలంగాణ పత్రికలో గీసుగొండ మండలంలో ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు పెండింగ్ అని వచ్చిన వార్తను గమనించాను. లబ్ధిదారుల ఆవేదన వాస్తవమే, వారి ఇబ్బందిని నేను అర్థం చేసుకున్నాను. కానీ కొన్ని వాస్తవాలు ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉంది. 1. రాష్ట్ర ప్రభుత్వం తన వాటా రూ. 3.40 లక్షలు ఇప్పటికే విడుదల చేసింది: మన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గతంలో ఎన్నడూ లేని విధంగా ఇందిరమ్మ ఇళ్లకు ఒక్కో ఇంటికి రూ. 5 లక్షల చొప్పున ఇస్తుంది. అందులో రాష్ట్ర వాటా రూ. 3.40 లక్షలు ఇప్పటికే 290 మంది లబ్ధిదారుల ఖాతాల్లో జమ అయ్యాయి. ఇది గత ప్రభుత్వంలో జరగలేదు. 2. మిగిలిన రూ. 1.60 లక్షలు కేంద్ర ప్రభుత్వం నుండి రావాల్సిన పి ఎం ఏ వై-జి నిధులు: ఈ నిధులు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విడుదల చేయాల్సి ఉంది. కేంద్రం నిధులు విడుదల చేయకపోవడం వల్లనే తుది బిల్లు పెండింగ్ లో ఉంది. ఇది కేవలం గీసుగొండ సమస్య కాదు, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సమస్య. 3. కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉంది: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా కేంద్రంతో మాట్లాడి ఈ నిధులు త్వరగా విడుదల అయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. ఎవరికీ అన్యాయం జరగదు, ప్రతి లబ్ధిదారుడికి పూర్తి బిల్లు వస్తుంది. 4. అధికారులతో మాట్లాడాము : ఈ విషయంపై మా పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి మరియు నేను సంబంధిత హౌసింగ్ అధికారులతో మాట్లాడాము . ఫైనల్ ఫోటో క్యాప్చర్ అయిన వారందరికీ వారం, పది రోజుల్లో కేంద్ర నిధులు రాగానే వెంటనే బిల్లులు పడతాయని హామీ



ఇచ్చారు. కాబట్టి లబ్ధిదారులు ఆందోళన చెందవద్దని, కాంగ్రెస్ ప్రభుత్వం మీకు అండగా ఉందని, మీ ఇంటి కలను నెరవేర్చే బాధ్యత మాదని తెలియజేస్తున్నాను. ఈ విషయంలో ప్రతిపక్షాలు చేస్తున్న రాజకీయాలను నమ్మవద్దని కోరుతున్నాను.

# 13 ఏళ్ల నిరీక్షణకు తెర.. జగ్గారెడ్డి కృషి తో భూములు కోల్పోయిన పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ

- తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ఇళ్ల స్థలాల కేటాయింపు కోసం వెలువడ్డ మొట్టమొదటి జి వో
- ఇళ్ల స్థలాల పంపిణీ పై గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాం లోనుండి కొనసాగుతున్న నిషేధం
- జగ్గారెడ్డి విజ్ఞప్తి మేరకు తొగర్ పల్లి లో ఇళ్ల స్థలాల కేటాయింపు కోసం 13 ఏళ్ల లో రాష్ట్రం లో మొట్టమొదటిసారిగా విడుదలైన జి.వో
- తొగర్‌పల్లి సర్వే నం.418లో 93 మంది లబ్ధిదారులకు 125 గజాల చొప్పున ఇంటి పట్టాలు పంపిణీ చేసిన నిర్మలా జగ్గారెడ్డి






సెప్టెంబర్ 25 సందేశం టైమ్స్

ఏళ్ల తరబడి సొంతింటి స్థలం కోసం ఎదురుచూస్తున్న పేదల నిరీక్షణకు తెరపడింది. తొగర్‌పల్లి, అలియాబాద్ గ్రామాలకు చెందిన భూములు కోల్పోయిన లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. తొగర్‌పల్లి సర్వే నంబర్ 418లో మొత్తం 93 మంది లబ్ధిదారులకు 125 గజాల చొప్పున స్థలాలను కేటాయిస్తూ పట్టాలు అందజేశారు.కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గతంలో ఇళ్ల స్థలాల కోసం పట్టాలు పొందినప్పటికీ, తదనంతర పరిణామాలతో లబ్ధిదారులకు స్థలాల పొజిషన్ అందకపోవడంతో సమస్య కొనసాగుతూ వచ్చింది. దీంతో తమకు కేటాయించిన స్థలాలను చూపించి, సొంతింటి కలను సాకారం చేయాలని లబ్ధిదారులు పలుమార్లు అధికారులను, ప్రజాప్రతినిధులను కోరుతూ వచ్చారు.

## 2011లో కేటాయింపులు.. ఆ తర్వాత నిలిచిన ప్రక్రియ

తొగర్‌పల్లి, అలియాబాద్ ప్రాంతాల్లో భూములు కోల్పోయిన కుటుంబాలకు గతంలో ఇళ్ల స్థలాల కేటాయింపు ప్రక్రియ చేపట్టారు. అయితే ప్రభుత్వం మారిన అనంతరం గతంలో జరిగిన కేటాయింపులు అమలులోకి రాకపోవడంతో లబ్ధిదారులు స్థలాల కోసం సంవత్సరాల తరబడి ఎదురుచూడాల్సి వచ్చింది.ఈ సమస్యపై మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి పలుమార్లు అసెంబ్లీలో ప్రస్తావించారు.

## మంత్రి పొంగులేటిని కలిసిన జగ్గారెడ్డి

ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారం కోసం మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి గత సంవత్సరం రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి సమస్యను వివరించారు. అనంతరం మంత్రి అప్పటి సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతికి ఫోన్ చేసి, లబ్ధిదారులకు పొజిషన్ చూపించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

## నిర్మలా జగ్గారెడ్డి చేతుల మీదుగా పట్టాల పంపిణీ

తొగర్‌పల్లి సర్వే నంబర్ 418లో లబ్ధిదారులకు నిర్మలా జగ్గారెడ్డి చేతుల మీదుగా పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు, సీడీసీ చైర్మన్ రామ్‌రెడ్డి, కొండాపూర్ తహసీల్దార్ అశోక్ తదితరులు పాల్గొన్నారు. 13 ఏళ్ల నిరీక్షణకు తెర.. జగ్గారెడ్డి కృషి తో భూములు కోల్పోయిన పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ ఇళ్ల స్థలాల పంపిణీ పై గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాం లోనుండి కొనసాగుతున్న నిషేధం జగ్గారెడ్డి కోరిక మేరకు తొగర్ పల్లి లో ఇళ్ల స్థలాల కేటాయింపు కోసం రాష్ట్రం లోనే మొట్టమొదటిసారిగా విడుదలైన జి.వో తొగర్‌పల్లి సర్వే నం.418లో 93 మంది లబ్ధిదారులకు 125 గజాల చొప్పున ఇంటి పట్టాలు పంపిణీ చేసిన నిర్మలా జగ్గారెడ్డి ఏళ్ల తరబడి సొంతింటి స్థలం కోసం ఎదురుచూస్తున్న పేదల నిరీక్షణకు తెరపడింది. తొగర్‌పల్లి, అలియాబాద్ గ్రామాలకు చెందిన భూములు కోల్పోయిన లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. తొగర్‌పల్లి సర్వే నంబర్ 418లో మొత్తం 93 మంది లబ్ధిదారులకు 125 గజాల చొప్పున స్థలాలను కేటాయిస్తూ పట్టాలు అందజేశారు.కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గతంలో ఇళ్ల స్థలాల కోసం పట్టాలు పొందినప్పటికీ, తదనంతర పరిణామాలతో లబ్ధిదారులకు స్థలాల పొజిషన్ అందకపోవడంతో సమస్య కొనసాగుతూ వచ్చింది. దీంతో తమకు కేటాయించిన స్థలాలను చూపించి, సొంతింటి కలను సాకారం చేయాలని లబ్ధిదారులు పలుమార్లు అధికారులను, ప్రజాప్రతినిధులను కోరుతూ వచ్చారు.

## 2011లో కేటాయింపులు.. ఆ తర్వాత నిలిచిన ప్రక్రియ

తొగర్‌పల్లి, అలియాబాద్ ప్రాంతాల్లో భూములు కోల్పోయిన కుటుంబాలకు గతంలో ఇళ్ల స్థలాల కేటాయింపు ప్రక్రియ చేపట్టారు. అయితే ప్రభుత్వం మారిన అనంతరం గతంలో జరిగిన కేటాయింపులు అమలులోకి రాకపోవడంతో లబ్ధిదారులు స్థలాల కోసం సంవత్సరాల తరబడి ఎదురుచూడాల్సి వచ్చింది.ఈ సమస్యపై మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి పలుమార్లు అసెంబ్లీలో ప్రస్తావించారు.

## మంత్రి పొంగులేటిని కలిసిన జగ్గారెడ్డి

ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారం కోసం మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి గత సంవత్సరం రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి సమస్యను వివరించారు. అనంతరం మంత్రి అప్పటి సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతికి ఫోన్ చేసి, లబ్ధిదారులకు పొజిషన్ చూపించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

## తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక వెలువడిన తొలి జి వో

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత వచ్చిన బిఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ స్కీమ్ తెచ్చిన నేపథ్యం లో రాష్ట్ర వ్యాప్తంగా ఇళ్ల స్థలాల కేటాయింపు పై నిషేధం విధించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం లో సైతం ఇళ్ల స్థలాల పై అదే నిషేధం కొనసాగుతూ వస్తోంది. జగ్గారెడ్డి విజ్ఞప్తి మేరకు గత 13 ఏళ్ల తర్వాత తెలంగాణ రాష్ట్రం లో ఇళ్ల స్థలాల కేటాయింపు కోసం తొలి జీవో విడుదలైంది.

## నిర్మలా జగ్గారెడ్డి చేతుల మీదుగా పట్టాల పంపిణీ

తొగర్‌పల్లి సర్వే నంబర్ 418లో లబ్ధిదారులకు నిర్మలా జగ్గారెడ్డి చేతుల మీదుగా పట్టాలు పంపిణీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇళ్ల స్థలా కేటాయింపు పై 13 ఏళ్లుగా నిషేధం ఉన్నా జగ్గారెడ్డి కృషి తో తొగర్ పల్లి లో ఇళ్ల స్థలాల కు పట్టాలు మంజూరు చేయడం సాధ్యం అయిందని నిర్మలా జగ్గారెడ్డి, అధికారులు గుర్తు చేశారు. తొగర్ పల్లి గ్రామానికి చెందిన 72 మంది, అలియాబాద్ గ్రామానికి చెందిన 21 మంది రైతులకు ఈరోజు పట్టాలు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు, సీడీసీ చైర్మన్ రామ్‌రెడ్డి, నాయకులు నర్సింహా రెడ్డి, కొండాపూర్, అలియాబాద్ గ్రామ సర్పంచులు,కొండాపూర్ తహసీల్దార్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

30

# బోనగాని రాజ్ కుమార్‌ను పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సహాయం అందించిన అల్లం స్వప్న బాల కిషోర్ రెడ్డి

- ప్రముఖ పారిశ్రామికవేత్త,సమాజ సేవకులు అల్లం స్వప్న బాల కిషోర్ రెడ్డి

సెప్టెంబర్ 25 సందేశం టైమ్స్

కొమ్మాల గ్రామానికి చెందిన బోనగాని రాజ్ కుమార్ ఇటీవల కాలి శస్త్రచికిత్స చేయించుకుని అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న ప్రముఖ పారిశ్రామికవేత్త,సమాజ సేవకులు అల్లం స్వప్న బాల కిషోర్ రెడ్డి గీసుకొండ గ్రామ సర్పంచ్ వీరగోని రాజ్ కుమార్ ఆయనను పరామర్శించారు.ఈ సందర్భంగా ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ రూ.5,000/- ఆర్థిక సహాయం అందించారు. ఆయన కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బట్ట మేకల శివ, సాయిలి మధు, బోగి శ్రీను, సాయిలి నరేందర్, మాడిశెట్టి కుమారస్వామి, చింతల రమేష్, జూలూరి కేదారి, మాడిశెట్టి రఘు, సాయిలి సాంబయ్య, సాయిలి వినయ్, మారబోయిన మహేందర్, మనుగొండ ఉపసర్పంచ్ యంబాడి సామ్రాజ్యం, గీసుకొండ సొసైటీ డైరెక్టర్ దౌడు సునీల్, మాజీ ఉప సర్పంచ్ పొగాకు బిక్షపతి, మాజీ ఎంపీటీసీ బానోతు శ్రీనివాస్, సాయిలి స్వామి, గుగులోతు



రాజు,దశ్రు తండా టీం ఏ బి ఆర్ సభ్యులు బాధవత్ లాల్ సింగ్,మాజీ వార్డు మెంబర్ దౌడు రాజేష్, గాడిదల బొంద్యాలు, కొమ్మాల గణపతి యూత్ అసోసియేషన్ సభ్యులు, గ్రామ ప్రజలు, భక్తులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వాటర్ ప్లాంట్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి..

- కేడం లింగమూర్తి బాలవికాస సంస్థ రాష్ట్ర అధ్యక్షులు

సెప్టెంబర్ 25 సందేశం టైమ్స్

బాలవికాస సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు కేడం లింగమూర్తి ఉమ్మడి వరంగల్ జిల్లాలో బాలవికాస ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలు వాటర్ ప్లాంట్లను సందర్శించి పరిశీలించారు. గిర్నిబాయి, రాజ్యా తండా, పీజీ తండా తదితర గ్రామాల్లో ప్లాంట్ల పనితీరు, నిర్వహణ, రికార్డులు, ప్రజలకు తాగునీటి సరఫరా విధానాన్ని పరిశీలించారు. యంత్ర పరికరాల లోపాలతో పనిచేయని ప్లాంట్లను గుర్తించి, వాటికి త్వరితగతిన మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని సంస్థ ప్రతినిధులను ఆదేశించారు.పలు రాష్ట్రాల్లో సుమారు 1,600 వాటర్ ప్లాంట్లు నిర్వహిస్తున్నట్లు కేడం లింగమూర్తి తెలిపారు. అవసరమైన గ్రామాల్లో కొత్త ప్లాంట్ల ఏర్పాటుకు పరిశీలన చేస్తున్నట్లు చెప్పారు.హుస్నాబాద్‌లో బాలవికాస ఆధ్వర్యంలో వాటర్ ప్లాంట్ నడుస్తుందని, త్వరలో మరో రెండు ప్లాంట్లను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.

# పాపకొల్లు గ్రామంలో వినాయక నవరాత్రి మహోత్సవాలు మహా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన గ్రామ సర్పంచ్ బాదవతు రాంబాబు గ్రామ పెద్దలు

సెప్టెంబర్ 25 సందేశం టైమ్స్



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం పాపకొల్లు గ్రామంలో శ్రీ వరసిద్ధి వినాయక నవరాత్రులలో భాగంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు తీర్థ ప్రసాదాలు ముఖ్య అతిథిగా హాజరై మహా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన గ్రామ సర్పంచ్ బాదవతు రాంబాబు మాట్లాడుతూ గ్రామంలో పాడి పంటలు గ్రామ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని వరసిద్ధి వినాయకుడు స్వామి వారి ఆశీస్సులు గ్రామ ప్రజలు పై ఎల్లప్పుడూ ఉండాలని అందరికీ శ్రీ వరసిద్ధి వినాయక నవరాత్రుల వీడ్కోలు శుభాకాంక్షలు తెలియజేసినారు ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు రోకటి రమేష్, మున్నూరు కాపు సంఘం జూలూరుపాడు మండల అధ్యక్షులు మండల కాంగ్రెస్ నాయకులు రామిశెట్టి రాంబాబు, సొసైటీ డైరెక్టర్ పాపినివెంకయ్య, రోకటి సుధా, ఊడల పెద్ద శేషగిరి, చిన్న శేషగిరి, పాపిని రమేష్ పాపిని కిషోర్,,పాపిని మధు, ఊడల దినేష్, పురేటి కిట్టు , తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు

# తుఫాను కారణంగా ముంపుకు గురైన ఇళ్లలో సర్పంచ్ సహాయ చర్యలు



సెప్టెంబర్ 25 సందేశం టైమ్స్

నారాయణపురం గ్రామపంచాయతీ, అశ్వరావుపేట మండలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నిన్న, మొన్న ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షం, తుఫాను కారణంగా నారాయణపురం గ్రామపంచాయతీలో కూతడి చిలకయ్య , పోలమూరు సౌజన్య ఇల్లు పూర్తిగా నీట మునిగిన విషయం తెలిసిన వెంటనే,సర్పంచ్. మడకం కుమారి ఆంధ్రయ్య , ఉప సర్పంచ్ ఆకుల శీను గ్రామపంచాయతీ కార్యదర్శి క్రాంతి కుమార్. ఉదయమే స్వయంగా అక్కడికి వెళ్లి దగ్గరుండి జేసీబీ సహాయంతో నీరు వెళ్లే మార్గాన్ని గుర్తించి, నీటిని వేరే డ్రైనేజీలకు మళ్లించి తొలగించడం జరిగింది.అలాగే గ్రామంలో అక్కడక్కడ డ్రైనేజీలలో నీళ్లు సరిగా వెళ్లక ఇబ్బంది పడుతున్న ప్రజల ఇళ్లలోని నీటిని తొలగించి, డ్రైనేజీలలో పూడికతీత పనులు చేయించడం జరిగింది. గ్రామంలో ఎక్కడా నీళ్లు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకున్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రేపు, ఎల్లుండి కూడా వర్షాలు, తుఫాను ఉన్నందున ప్రజలందరూ జాగ్రత్తగా ఉండాలని, నీళ్లు మునిగిన వారికి తగిన సూచనలు చేశారు.గ్రామపంచాయతీజి పి ఓ కల్కి రమేష్. కూడా నీళ్లు మునిగిన ఇళ్లను పరిశీలించారు.

## ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు:

- 4వ వార్డు మెంబర్ మడకం ఆంధ్రయ్య- కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు చినంచెట్టి నాగేంద్ర.- కాంగ్రెస్డీసీసీ మహిళా అధ్యక్షురాలు శ్రీమతి పెదపూడి సత్యవతి - కాంగ్రెస్ సీనియర్ పరిటాల సందీప్ కుమార్ - కాంగ్రెస్ యువ నాయకులు పసుపులేటి నరేష్ - సవరం సుబ్బారావు - కంద్రకొండ శ్రీను.- పల్లెల శివ , శ్రీకాంత్ - గ్రామ పెద్దలు, యువకులు, పంచాయతీ సిబ్బంది ఈ యొక్క కార్యక్రమంలో పాల్గొన్నారు

# ఆర్మూర్ ఎస్ ఎస్ కె క్షత్రియ సమాజ్ ఆధ్వర్యంలో శ్రీ దత్తాత్రేయ లక్ష్మీనారాయణ ఆలయంలో గణపతి యజ్ఞం

- ఎస్ ఎస్ కె క్షత్రియ సమాజ్ అధ్యక్షుడు గటడి ఆనంద్ సీనియర్ (న్యాయవాది) కార్యదర్శి డీకే రాజేష్

సెప్టెంబర్ 25 సందేశం టైమ్స్



ఆర్మూర్ ఎస్ ఎస్ కె క్షత్రియ సమాజ్ ఆధ్వర్యంలో శ్రీ దత్తాత్రేయ లక్ష్మీనారాయణ మందిరంలో గణపతి యజ్ఞం నిర్వహించడం జరిగింది. రాత్రి 8 గంటలకు గణపతి స్వామివారి అన్న ప్రసాదం కలదు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి పునీతులు కావాలని కోరుతున్నాము. గణపతి యజ్ఞం లో ఆర్మూర్ ఎస్ ఎస్ కె క్షత్రియ సమాజ్ అధ్యక్షుడు గటడి ఆనంద్ సీనియర్ (న్యాయవాది), కార్యదర్శి డీకే రాజేష్ మరియు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ, ప్రైవేట్ హాస్పిటళ్లలో ఫైర్ సేఫ్టీపై మంత్రి దామోదర్ రాజనర్సింహ సమీక్ష

- అన్ని హెల్త్ ఫెసిలిటీస్‌లో ఫైర్ సేఫ్టీ ఆడిట్‌పై అధికారులతో చర్చ
- హాస్పిటళ్లలో ఫైర్ సేఫ్టీ ప్రమాణాల అమలు, లోపాల గుర్తింపు, సరిదిద్దే చర్యలపై సమీక్ష



సెప్టెంబర్ 25 సందేశం టైమ్స్

ప్రభుత్వ హాస్పిటళ్లలో ఫైర్ సేఫ్టీకి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, ఫైర్ సేఫ్టీ ఆడిటింగ్ కూడా రెగ్యులర్‌గా చేపిస్తున్నామని మంత్రికి వివరించిన ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు ఇప్పటికే నిర్వహించిన ఫైర్ ఆడిట్లలో గుర్తించిన అంశాలు, తీసుకున్న చర్యలపై సమీక్షిస్తున్న మంత్రి ఫైర్ సేఫ్టీ లోపాలు ఉన్న చోట తక్షణమే అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు సెక్రటేరియట్‌లో జరుగుతున్న ఈ సమావేశంలో పాల్గొన్న స్పెషల్ సీఎస్ నవీన్ మిట్టల్, ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు, ఫైర్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్ డీజీ విక్రమ్ సింగ్ మాన్, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ, హెల్త్, ఎనర్జీ, ఆర్ అండ్ బీ, తదితర శాఖల ఉన్నతాధికారులు

# రెడ్ క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యుడిగా ముల్క ప్రసాద్ నామినేషన్ దాఖలు

సెప్టెంబర్ 25 సందేశం టైమ్స్




వరంగల్ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, వరంగల్ జిల్లా శాఖ మేనేజింగ్ కమిటీ సభ్యుడిగా పోటీ చేస్తున్న ముల్క ప్రసాద్ గురువారం వరంగల్ జిల్లా పరిషత్ కార్యాలయంలోని జడ్పీ హాల్‌లో ఎన్నికల రిటర్నింగ్ అధికారికి తన నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ఈ సందర్భంగా ముల్క ప్రసాద్ మాట్లాడుతూ, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు, రక్తదానం, ఆరోగ్య సేవలు, విపత్తుల సమయంలో సహాయ కార్యక్రమాలు, సామాజిక సేవలను మరింత విస్తృతం చేయడానికి కృషి చేస్తామని తెలిపారు. అలాగే, రెడ్ క్రాస్ సేవా కార్యక్రమాలను మరింత బలోపేతం చేసేందుకు తమ ప్యానల్ సభ్యులతో కలిసి పనిచేస్తామని పేర్కొన్నారు. రెడ్ క్రాస్ సభ్యులు తమ ప్యానల్ సభ్యులకు ఓటు వేసి, అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ముల్క ప్రసాద్ మనస్ఫూర్తిగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ముల్క ప్రసాద్ ప్యానల్ సభ్యులు, వడిచర్ల నగేష్ ,జలిగపు రామ్ ప్రసాద్ మద్దతుదారులు మరియు పలువురు రెడ్ క్రాస్ సభ్యులు పాల్గొన్నారు.

# ఎడతెరిపి లేని వర్షాలు.. దమ్మపేట పంచాయతీ సహాయక చర్యలు

- ఉప సర్పంచ్ ఆంగోతు శ్రీనివాసరావు

సెప్టెంబర్ 25 సందేశం టైమ్స్





అర్నాబ్ తుఫాన్ ప్రభావంతో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దమ్మపేట గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో సహాయక చర్యలు చేపట్టారు. సర్పంచ్ రమాదేవి ఆదేశాల మేరకు ఉప సర్పంచ్ ఆంగోతు శ్రీనివాసరావు గురువారం ఉదయం జేసీబీ సహాయంతో రోడ్లపై పడిన చెట్లను, కాల్వల్లో పేరుకుపోయిన చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి, పూడికతీత పనులు చేపట్టారు. తొలగించిన వ్యర్థాలను ట్రాక్టర్ల ద్వారా డంపింగ్ యార్డుకు తరలించారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ ఆంగోతు శ్రీనివాసరావు మాట్లాడుతూ.. వర్షపు నీరు నిల్వకుండా చర్యలు చేపడుతున్నామని, ప్రజల భద్రత, సౌకర్యానికి ప్రాధాన్యతనిస్తూ డ్రెయినేజీ వ్యవస్థ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. గ్రామ పరిధిలో ఎక్కడైనా చెట్లు లేదా విద్యుత్ స్తంభాలు కూలిపోతే వెంటనే 9177324267, 9959133861 నంబర్లకు సమాచారం అందించాలని గ్రామ ప్రజలకు సూచించారు.

# గుంటిపెల్లి దుర్గేశ్ పోరాట స్ఫూర్తిని కొనసాగిద్దాం..

- 7వ వర్ధంతి సందర్భంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి గడిపె మల్లేశ్.

సెప్టెంబర్ 25 సందేశం టైమ్స్

రోడ్డు వెడల్పు పేరుతో మహనీయులైన ఆనభేరి ప్రభాకర్ రావు విగ్రహాలను తొలగించిన అధికారులు తిరిగి నెలకోల్పోటంలో నిర్లక్ష్యం వహించడం సరైన పద్ధతి కాదు.. అలాగే స్వర్గీయులైన ఎంతో మంది మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేసుకోవలసిన స్థానంలో ఎక్కడో మైదానంలో కానీ క్రీడా స్థలాలలో కానీ ఏర్పాటు చేయవలసిన బొమ్మలను తీసుకువచ్చి మహనీయులను గుర్తు చేసుకునేలా ఏర్పాటు చేసుకోవాల్సిన విగ్రహాల స్థానంలో
ఆ బొమ్మలను నెల కొల్పడం దేనికి నిదర్శనమో అధికారులు చెప్పాలని తొలగించిన విగ్రహాలను వెంటనే నెల కోల్పోకపోతే గుంటుపల్లి దుర్గేశ్ పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని నిరసన కార్యక్రమాలతో నిరాహార దీక్షలతో అధికారులను నిలదీసే కార్యక్రమం త్వరలోనే చేపడతామని గడిపె మల్లేశ్ అన్నారు. పేదలకు అన్యాయం జరుగుతుంది అని తెలిసిన క్షణం పేదల వెంటే ఉంటు బాధితులకు న్యాయం జరిగే వరకు అధికారులకు ఏమాత్రం భయపడకుండా ఎర్రజెండాను చేతిలో పట్టుకుని అన్యాయాల ఎదుర్కొనే గొప్ప నాయకున్ని భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) కోల్పోయి 7 సంవత్సరాలు గడిచినా దుర్గేశ్ వర్ధంతి కార్యక్రమం స్థానిక అనభేరి, సింగిరెడ్డి అమరుల భవనంలో హుస్నాబాద్ మండల సిపిఐ పార్టీ పక్షాన ఘనంగా నిర్వహించి ఆయన చిత్ర పటానికి పుల మాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి హుస్నాబాద్ మాజీ వైస్ ఎంపిపి గడిపె మల్లేశ్ మాట్లాడుతూ గుంటిపెల్లి దుర్గేశ్ చేసిన పోరాటాలను గుర్తు చేసుకుంటూ ముఖ్యంగా తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తహసీల్దారు కార్యాలయం ముట్టడి,కొత్త చెరువు శిఖం భూమి కబ్జాకు గురికాకుండా చేసిన పోరాటాలు అభినందనీయమని మనం కోల్పోయిన ముఖ్య సిపిఐ నాయకులు దుర్గేశ్ ఆశాయాల సాధనకు ప్రజా పోరాటాలను కొనసాగిస్తూ మన మందరం ఎర్రజెండ చేతబుని నేడు దేశంలో జరుగుతున్న




అన్యాయాలను ఎక్కడికక్కడే ఎండగట్టి నప్పుడే పేదలకు న్యాయం జరుగుతుందని అంతవరకు పోరాటాలు చేయాలని అప్పుడే అమరుల ఆశయాలు ఫలిస్తాయని దుర్గేశ్ లాంటి ప్రజా నాయకులకు ఘన మైన అని గడిపె మల్లేశ్ అన్నారు. ఈ కార్య క్రమంలో భారతజాతీయ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు గూడ పద్మ, ఎఐవైఎఫ్ జిల్లాఅధ్యక్షులు జనగాం రాజ్ కుమార్, అయిలేని మల్లారెడ్డి, మహ్మద్ అక్బర్, వంగ రాజు,అంకం శ్రీనివాస్,పెద్ది నిర్మల అంకం సాయి కుమార్ గుంటిపెల్లి దుర్గేశ్ కుటుంబ సభ్యులు, గుంటిపెల్లి అజయ్, గుంటిపెల్లి శైలేజ, ముద్రకోల శ్యామల, ముద్రకొల రవీందర్ పాల్గొన్నారు.

# గోండి (కోయ) భాషా ప్రామాణీకరణకు కృషి చేయాలి

- 8వ షెడ్యూల్‌లో గుర్తింపు సాధించడమే లక్ష్యం: ఎమ్మెల్యే జారె ఆదినారాయణ

సెప్టెంబర్ 25 సందేశం టైమ్స్

తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో 12వ జాతీయ గోండి (కోయ) భాషా ప్రామాణీకరణ వర్క్‌షాప్ కరపత్రాన్ని మంగళవారం ఆవిష్కరించారు. మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, పినపాక ఎమ్మెల్యే కోరం కనకయ్య, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, వర్క్‌షాప్ నిర్వాహకులు కలిసి కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాట్లాడుతూ ప్రాచీన సంస్కృతి, విశిష్టమైన చరిత్ర కలిగిన గోండి (కోయ) భాషను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. గోండి (కోయ)



భాషకు రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో గుర్తింపు సాధించడమే లక్ష్యంగా భాషా ప్రామాణీకరణ కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు.
భద్రాచలం ఐటీడీఏ గిరిజన భవన్‌లో అక్టోబర్ 2 నుంచి 6వ తేదీ వరకు ఐదు రోజులపాటు జాతీయ స్థాయి వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు తెలిపారు. కోయ భాష అభివృద్ధికి అవసరమైన డిక్షనరీ రూపకల్పనతో పాటు భాషా, సాంస్కృతిక విశిష్టతలను భావితరాలకు అందించేందుకు ఇటువంటి జాతీయ స్థాయి వర్క్‌షాప్‌లు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు, భాష పరిరక్షణకు ప్రజాప్రతినిధులుగా తమ వంతు సంపూర్ణ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఎమ్మెల్యే జారె హామీ ఇచ్చారు. గిరిజన ప్రాంతాల ప్రజాప్రతినిధులు, భాషాభిమానులు, మేధావులు, భాషా పరిశోధకులు ఐదు రోజులపాటు జరిగే ఈ జాతీయ వర్క్‌షాప్‌లో పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# టర్నడో తాకిడికి గుర్వాయిగూడెం విలవిల

- నేలకొరిగిన చెట్లు.. ధ్వంసమైన పంట తోటలు
- మామిడి, జీడి, పామాయిల్, పత్తికి భారీ నష్టం.. నష్టపరిహారం కోసం రైతుల వేడుకోలు

సెప్టెంబర్ 25 సందేశం టైమ్స్

ప్రకృతి ప్రకోపానికి దమ్మపేట మండలం జగ్గారం పంచాయతీ పరిధిలోని గుర్వాయిగూడెం గ్రామం విలవిలలాడింది. గురువారం అకస్మాత్తుగా వీచిన బలమైన ఈదురుగాలులు, టర్నడో ప్రభావంతో గ్రామ పరిసరాల్లోని పంట తోటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. క్షణాల వ్యవధిలోనే తోటల్లోని చెట్లు నేలకొరగడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ముఖ్యంగా మామిడి, జీడి, పామాయిల్ తోటలతో పాటు పత్తి పంటకు గణనీయమైన నష్టం వాటిల్లినట్లు రైతులు తెలిపారు. బలమైన గాలుల ధాటికి పలుచోట్ల చెట్లు నేలకొరగగా, మరికొన్ని చోట్ల భారీ కొమ్మలు విరిగిపడ్డాయి. పామాయిల్ చెట్లు సైతం దెబ్బతినడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. పత్తి పంట కూడా గాలుల తీవ్రతకు దెబ్బతిన్నట్లు రైతులు పేర్కొన్నారు. కళ్లముందే కష్టార్జితం ధ్వంసం ఏళ్ల తరబడి తోటలను పెంచుకుంటూ పెట్టుబడులు పెట్టిన రైతులకు టర్నడో తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. పంటలపై ఆశలు పెట్టుకున్న తరుణంలో ప్రకృతి వైపరీత్యం విరుచుకుపడటంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఒక్కసారిగా సంభవించిన ఈ ఘటనతో తోటల్లో జరిగిన నష్టాన్ని చూసి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణం నష్టపరిహారం అందించాలి గుర్వాయిగూడెంలో అధికారులు తక్షణమే పర్యటించి దెబ్బతిన్న పంట తోటలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని రైతులు కోరుతున్నారు. ప్రతి తోటలో జరిగిన నష్టాన్ని





సమగ్రంగా నమోదు చేసి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిహారం అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఆలస్యం చేయకుండా వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు సంయుక్తంగా నష్టం అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపాలని రైతులు కోరుతున్నారు.

# ఆర్మూర్ ఎస్ ఎస్ కె క్షత్రియ సమాజ్ శ్రీ లక్ష్మీనారాయణ మందిరంలో లడ్డు వేలం పాట

- లడ్డు వేలం పాట 13519 రూపాయలకు దొండి ఈశ్వర్ తీసుకున్నారు

సెప్టెంబర్ 25 సందేశం టైమ్స్



ఆర్మూర్ శ్రీ లక్ష్మీనారాయణ మందిరంలో లడ్డూ వేలంపాట నిర్వహించారు వేలం పాటలో అధిక సంఖ్యలో వేలంపాట నిర్వహించారు ఈ వేలం పాటలు దొండి ఈశ్వర్ 13519 రూపాయలకు వేలంపాటలో తీసుకున్నారు. ఈ వేలంపాటలో ఆర్మూర్ ఎస్ ఎస్ కె సమాజ్ అధ్యక్షుడు గటడి ఆనంద్ సీనియర్ (న్యాయవాది) కార్యదర్శి డీకే రాజేష్ మరియు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.